గంధం దొంగలు!!

శ్యాంబాబు

శివపురి పెద్ద వూరేమీ కాదు. జనాభా సుమారుగా రెండు వేలు వుంటుంది. అయినా ఆ చుట్టుప్రక్కల వూళ్ళన్నిటికీ అదే పెద్ద వూరు. అడవి సరిహద్దులోనే వుండడం వలన, చుట్టు ప్రక్కల కాస్త పెద్ద వూరు కావడంవలన శివపురి ఫారెస్టు ఆఫీసు ఆ వూళ్ళోనే పెట్టారు.

శివపురికి నేను కొత్తగా ఫారెస్టు ఆఫీసరుగా అపాయింట్ చేయబడి ఆ రోజే వచ్చాను.

పెంకుటిళ్ళు, రాతి మిద్దెలు, పూరిపాకలకు ఎడంగా గోపీరంగు వేసిన మా కాంక్రీటు ఆఫీసు బిల్డింగు కొట్టొచ్చినట్లు కనిపిస్తూ వుంటుంది. ఆఫీసులోనే కాక, టైపిస్టు

ఆఫీసు బం(ట్రో)తు, నా పర్సనల్ ప్యూను, క్లర్కు, నలుగురు ఫారెస్టు గార్డులు వున్నారు.

శివపురి అడవి చిన్నదయినా, ప్రభుత్వ దృష్టిలో చాలా విలువైన అడవి. అడవిలో కర్నాటక సరిహద్దులో వున్న భాగమంతా విలువైన పసుపు గంధం చెట్లతో నిండి వుంది. వాటితోపాటు కొంత భాగం అడవిలో పొట్టి రకం టేకు చెట్లు కూడా. మిగిలినవన్నీ మద్ది, తొగరు, రకరకాల చెట్లు...వీటితోపాటు ఈ అడవిలో ప్రభుత్వం పరిరక్షిస్తున్న జీవరాసి మరోటుంది. అదే 'సౌతిండియన్ లంగార్' అంటారు.

కోతి జాతికి చెందిన జంతువు. కొండముచ్చులాగా వుంటుంది. ఇండియాలో వున్న కోతుల్లోకల్లా అందమైనది, అపూర్వమైనది అని భావిస్తూ వుంటారు జంతు శాస్త్రజ్ఞులు. వీటన్నిటిని పరిరక్షించాల్సిన బాధ్యత నాది.

రావడంతోనే ఆఫీసులో ఓ వెనక గదిలో మకాం పెట్టాను. ఊరికి కాస్త ఎడంగా, చక్కని చెట్ల మధ్య ప్రశాంత వాతావరణంలో హాయిగా వుంది. మొదటి రోజంతా మేప్‌లు చూసుకోవడమూ, రికార్డులు చెక్ చేయడంలో సరిపోయింది. సాయంత్రం జీపేసుకొని ఊళ్లోకి వెళ్ళాను.

శివపురి పంచాయతి సర్పంచ్ రాఘవ యువకుడు. వయసు ముప్పై ఏళ్ళకన్నా ఎక్కువవుండదు. సాదరంగా ఆహ్వానించాడు నన్ను.

"నేను క్రొత్తగా వచ్చిన ఫారెస్టు ఆఫీసర్ని...నా పేరు రంగనాథ్" నన్ను నేను పరిచయం చేసుకున్నాను.

"నమస్తే! లోపలికి రండి!" అన్నాడు రాఘవ వరండాలో వేసివున్న కుర్చీ చూపెడుతూ.

"నిజానికి మీరింత చిన్నవయసువారని వూహించలేదు" అన్నాను సంభాషణ ప్రారంభించడానికి.

"మా వూళ్ళో చదువుకొన్నవాళ్ళంటే చాలా గౌరవం. ఈ వూళ్ళో బి. ఎ. పాసైన మొదటివాడ్ని నేను. ఒక్కడే కొడుకుని కావడంతో పట్నాల్లో వుద్యోగాలు చెయ్యడానికి వెళ్ళనివ్వలేదు నన్ను నాన్నగారు" అన్నాడతను సమాధానంగా.

తర్వాత మా సంభాషణ పెద్ద ఇబ్బంది లేకుండా సాగిపోయింది. చివరికి వచ్చిన విషయం బయట పెట్టాను, వూళ్లో వుండడానికి శుభ్రమైన ఇల్లు దొరుకుతుందేమోనని.

"ఈ వూళ్లో ఎవరూ అద్దెలకు ఇవ్వరు మాస్టారూ! ఎవరింట్లో వాళ్లే వుంటుంటారు. అంచేతే ఇదివరకు వున్న ఆఫీసరుగారు పారెస్టు బంగళాలోనే వుండేవారు. మీరంతగా కావాలంటే వాకబుచేసి మీకు కబురు పెడతాను" అన్నాడు రాఘవ.

అతనికి కృతజ్ఞతలు తెలిపి శెలవు తీసుకున్నాను. ఆఫీసుకు తిరిగి వచ్చేస్తోంటే మధ్యదార్లో వూరి చివర శివాలయం కనిపించింది. జీపు ఆపి ఆలయంలోకి వెళ్ళాను.

చాలా పురాతనమైన ఆలయం. రాతి కట్టడం. చుట్టూ పెద్ద ప్రాంగణం వున్నా మనుషు లెవరూ కనిపించలేదు. మెల్లిగా మెట్లెక్కి మంటపంలోకి వెళ్ళాను. గర్భగుడి గుమ్మం ఇవతలే ఆగి గంగా సమేతుడయిన శివుడికి తల వంచి భక్తిగా నమస్కరించి వెనుదిరిగాను.

"దైవ దర్శనానికి వచ్చేవాళ్ళు వుత్త చేతుల్తో రాకూడదు" అన్నారెవరో హఠాత్తుగా. చాలా కర్కశంగా పెద్దగా వుంది ఆ గొంతు.

ఒక్క క్షణం ఆ గొంతు తాలూకూ మనిషి నాకు కని

పించలేదు. మెల్లిగా మంటపం స్థంభాన వెనుక నుండి ఓ ఆకారం బయటికొచ్చింది. క్షణంపాటు కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయాను.

బానలాంటి పొట్ట, దాదాపు ఆరడుగుల పొడవు, వదులుగా కండలు పెరిగిపోయి వూగులాడుతోన్న జబ్బలు, రొమ్ములు, గుండ్రటి పెద్ద ముఖం, నుదుట అడ్డంగా విభూతి రేఖలు, ఎర్రటి తీక్షణమైన కళ్ళు, మాసిన గడ్డం, జుట్టు ముడి, స్థూల శరీరం...ఎర్రటి పంచె, చేతిలో పూల పళ్ళెం...ఎందుకో తెలియకుండానే గుండె జల్లుమంది. ఆలయపూజారి కాబోలు.

"ఎవరు నువ్వు? నిన్నెప్పుడూ చూసినట్టులేదు" అన్నాడు పూజారి అదే కర్కశమైన గొంతు.

"క్రొత్తగా వచ్చాను...ఫారెస్టు ఆఫీసర్ని" అన్నాను అతనిని మళ్ళీ నఖశిఖపర్యంతం చూస్తూ.

చేటల్లాంటి అతని చెవులకు బంగారు కుండలాలు వ్రేలాడుతున్నయ్. మెట్లు ఎక్కివచ్చి వుండాలి ఆయాసంతో రొమ్ములు, పొట్ట వూగుతున్నయ్.

"ఓహోఁ! ఇంకెప్పుడూ ఉత్తి చేతుల్తో రాక..." అన్నాడతను భారంగా గర్భగుడిలోకి వెళ్ళిపోతూ.

నేనతన్నోసారి విచిత్రంగా చూసి వెనక్కి వచ్చేశాను. ఎందుకో మనసు వికలంగా అయినట్లనిపించింది. ఆఫీసు దగ్గర ఆగకుండా జీపును అడివికేసి పోనిచ్చాను.

దారిలో గార్డు ఒకడు రైఫిల్ భుజాన వేసుకొని నడుస్తూ కనిపించాడు. జీపు అతని ప్రక్కనే ఆపాను. నన్ను చూచి క్షణం ఆశ్చర్యపోయి సెల్యూట్ చేశాడతను.

"జీపెక్కు" అన్నాను. అతను వెనక్కి ఎక్కి కూర్చున్నాడు.

"నీ పేరేమిటి?"

"అబ్దుల్లా సార్" అన్నాడతను.

అడవి దగ్గర పడుతోంది.

"దేవాలయంలో ఆ పూజారి చాలా విచిత్రమైన వ్యక్తిలా వున్నాడు" అన్నాను రియర్‌వ్యూలో అతని ముఖం చూస్తూ.

పూజారి పేరు చెప్పగానే అతను వులిక్కిపడ్డాడనిపించింది ఎందుకో.

"మీ కతడు...కనిపించాడా సార్?" అడిగాడు అబ్దుల్లా.

"అవును గుడిలోకి వెడితే మంటపంలో కనిపించాడు."

"ఇంకెప్పుడూ ఆ శివాలయంలోకి వెళ్ళకండి సార్! ఈ వూరి వాళ్లెవరూ ఆ గుడిలోకి వెళ్ళరు" అన్నాడు అబ్దుల్లా ముందుకు వంగి.

"ఎందుకని?"

"ఆ గుడి నిండా దయ్యాలు, భూతాలు వున్నాయి సార్."

"వాట్?" అన్నాను ఆశ్చర్యంగా.

"అవును సార్! ఆ విషయం యిక్కడందరికీ తెలుసు. ఆ పూజారి మహాలింగం మంత్రిగాడు. చేతబళ్ళు అవీ చేస్తుంటాడు. అతనంటే ఈ చుట్టుపట్ల అందరికీ భయమే" అన్నాడు అబ్దుల్లా భయంగా.

2

వారంరోజులు గడిచి పోయాయి. మధ్యలో ఓసారి రాఘవ వచ్చి కనుపించాడు. ఊళ్లో తమ ఇంటికి దగ్గరిగానే రాములయ్యగారింట్లో ఓగది ఖాళీ చెయ్యించాననీ, వచ్చి చూసుకొని ఇష్టమయితే వుండమని చెప్పాడు.

రాములయ్య గారిల్లు రాఘవ ఇంటికి రెండిళ్ళవతల వున్నది. రెల్లు గడ్డితో కప్పిన ఇల్లు, భూమట్టానికి నాలుగడుగుల ఎత్తున గట్టారు. వసారాకి ఆనుకొనివున్న ముందువైపు గది నా కిచ్చారు. పెద్దగది. పట్టణాల్లో అయితే దాన్నే రెండుగాచేసి ఓపోర్షన్‌గా అద్దెకిస్తారు. అద్దేమీ ఇవ్వక్కరలేదని అన్నారు రాములయ్య. ఆరోజు వుదయమే నా సామానంతా అందులోకి మార్చేశాను.

మధ్యాహ్నం రెండు గంటలవేళ గార్డ్సును ఇద్దర్ని వెంట తీసుకొని అడివిలోకి వెళ్ళాను. ఫారెస్ట్ బంగళా దగ్గర జీపు ఆపాము. ఇంతకు ముందు వున్న ఆఫీసరు బంగళాలోనే వుండడం వలన బంగళా పరిసరాలన్నీ శుభ్రంగా వున్నాయి. వాచ్‌మెన్ ఒక్కడు బయట అవుటహావుస్‌లో వుంటాడు.

జీ పక్కడవదిలేసి కాలినడకన బయల్దేరాము. యూంకిల్స్‌బూట్సుల క్రింద పడి ఎండుటాకులు చప్పుడు చేస్తున్నాయి. 'హనుమాన్‌లుగార్' ఒకటి చెట్టు మీది నుండి మా వైపు తీక్షణంగా చూసి కిచకిచ అరుస్తూ అడవి లోపలికి పారిపోయింది.

అడవి సరిహద్దు వరకూ వెళ్ళాలని నా ఊహ. అడవిని కర్నాటక రాష్ట్రాన్ని విడదీస్తూ మధ్య సరిహద్దులా చిన్న సెలఏరు ఒకటి పారుతూ వుంటుంది. అడవిఏపుగా పెరిగి వుండడం వలన జీపులో సరిహద్దువరకూ వెళ్ళడం కుదరదు.

ముందు అబ్దుల్లా, మధ్య నేను, వెనక మరోగార్డు జానీ నడుస్తున్నాము.

సరిహద్దు దగ్గర పడే కొలదీ వరసనే గంధపుచెట్లు కనిపించసాగాయి. గమ్మత్తయిన పచ్చి గంధం వాసన ముక్కుల్ని నింపుతోంది.

ఉన్నట్లుండి పెద్ద చెట్లు తగ్గిపోయి, నాలుగయిదు వందల చదరపు గజాలమీద రెండు మూడు అడుగుల ఎత్తులో వున్న మొద్దులు కనిపించాయి. మళ్ళీ వాటి తర్వాత మామూలుగా పెద్ద చెట్లు వున్నాయి.

అంటే ఆ ప్రదేశంలో ఇదివరకు ఏపుగా పెరిగిన చెట్లని నరికేసి, కొత్తవి నాటారన్నమాట.

మామూలుగా నాలుగయిదు టన్నుల బరువు తూగే సైజుకు పెరగడానికి గంధపు మొక్కకి దాదాపు ఎనిమిదేళ్ళ వరకూ పడుతుంది. క్రొత్త మొక్కలయితే కొమ్మలు నరికి మాను వదిలేస్తారు. మళ్ళీ చిగిరించి పెద్ద దవడానికి రెండు మూడుసార్లు కొమ్మలు నరికిన చెట్లయితే పూర్తిగా వ్రేళ్ళతో సహా తీసేసి ఆర్నెల్ల తర్వాత క్రొత్త మొక్కలు నాటుతారు.

మొక్కల సైజును బట్టి అవి నాటి సంవత్సరం దాటి వుండదనిపిస్తోంది. నడుస్తూనే లెక్కపెట్టాను. పదిహేను మొక్కలున్నాయి. అంటే ఇదివరకు కొట్టేసినవి కనీసం పదిచెట్లయినా వుండాలి. అంటే దాదాపు ఇరవై టన్నుల మెచ్యూర్డ్ గంధం సంవత్సరం క్రితమే వేలంవేసి వుండాలి. రికార్డుల్లో ఎక్కడ ఆ విషయం నేను చూసినట్లు గుర్తు లేదు. ప్రక్కనే వున్న పెద్ద మొక్కలు మానులమీద నెంబర్లు గుర్తు పెట్టుకొన్నాను, తర్వాత రికార్డు చెక్ చెయ్యడానికి.

ఫారెస్టు బంగళా నుండి సరిహద్దు సెలయేరు దగ్గరికి వచ్చేప్పటికి దాదాపు రెండు గంటలు పట్టింది. దట్టంగా ఏపుగా పెరిగిన చెట్లు సెలయేరుకి రెండు ప్రక్కలా చల్లని నీడ కలుగ చేస్తున్నయ్. ఆగి అలసటగా ఒడ్డునే ఓరాతిమీద కూర్చున్నాను.

అబ్దుల్లా, జానీలు కూడా బుజాలమీద రైఫిల్స్ దించి చెట్టుమానుకు చేరగిల బడ్డారు.

"ఈ ఏరు ఎక్కడి నుండి వస్తుంది?" అడిగాను.

"ఏమోసార్ పైన ఎక్కడో కొండల్లో పుడుతుంది. కర్నాటక వైపు వున్న అడవుల్లోంచి ప్రవహించి ఇక్కడ మన అడవిప్రక్కగా పోతుంది. దాదాపు పదిమైళ్ళ వరకూ ఈ ఏరే మనకు సరిహద్దు. మళ్ళీ అక్కడ నుండి లోపలికి తిరుగుతుంది" అన్నాడు అబ్దుల్లా.

"చూడ్డానికి పెద్దలోతు వున్నట్లు కనిపించడం లేదు. లోతుంటుందా?" అడిగాను.

"లేదుసార్" అదే ఆశ్చర్యం ఎంత దూరం వెళ్ళినా నడుములోతుకన్నా ఎక్కువ వుండదు. చల్లగా, తియ్యగా వుంటాయి నీళ్ళు" అన్నాడు జానీ బుజానవున్న ఫ్లాస్కులో టీ ప్లాస్టిక్ కప్పులో పోసి అందిస్తూ.

కప్పు అందుకొని మిగిలిన టీ వాళ్ళని త్రాగమని చెప్పాను. సాయంత్రం గావస్తున్నా. చాలా ప్రశాంతంగా హాయిగా వుంది అక్కడ. అప్పుడు గమనించాను నీటిలో తేలివస్తోన్న చిన్నచిన్న కర్ర తెప్పల్ని.

"ఏమిటవి?" అన్నాను వాటిని చూపెడుతూ.

"పైనెక్కడో కలప నరుకుతున్నాట్లున్నారు సార్. అడవిలో మొయ్యడం కష్టమని ఇలా కట్టలు కట్టి ఏట్లో వదిలేస్తారు. దిగువ లారీలు రాగలిగిన చోట ఒడ్డుకు లాగి లోడ్ చేస్తారు."

"మన కలప కాదుగదా?" అన్నాను వాటివైపే అనుమానంగా చూస్తూ.

"ప్రస్తుతం మనకి టెండర్లేమీ లేవు గదా సార్, అవతలివాళ్ళవి అయి వుంటాయి" అన్నాడు అబ్దుల్లా.

నల్లమద్దిచెట్లు కాబోలు, పెద్దపెద్ద దుంగలు నాలు గయిదు కట్టలు కట్టిన దుంగలు ఒకదాని వెనక ఒకటికొట్టు కొస్తున్నాయి. నేను టీ సిప్ చేస్తూ వాటివంకే చూస్తూ వుండి పోయాను. దూరంగా ఓ పెద్ద కట్ట కొట్టుకొస్తూ కనిపించింది. నల్లని దుంగల మధ్య పసుపురంగు దుంగ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మేమున్న ఒడ్డువైపే కొట్టు కొస్తోంది.

"వాటిమధ్యలో వున్నది ఏంకర్ర, పసుపుగా తెల్లగా వుంది" అన్నాను ఆ కట్ట చూపెడుతూ. వాళ్ళిద్దరూ ఓక్షణం ముఖాలు చూసుకొన్నారు.

"గంధంచెట్టుసార్! అడివి కొట్టుకోవడానికి టెండరు పాడి నప్పుడు, కంట్రాక్టర్లు ఒక్కోసారి దొంగతనంగా గంధంచెట్లు కూడా మిగతావాటితోపాటు కొట్టుకు పోతుంటారు." అన్నాడు అబ్దుల్లా.

విషయం అర్థమయింది నాకు. నల్ల మద్దిచెట్లు వేలంలో పాడుకొని కలప కంట్రాక్టరు వాటిపాటు దొంగతనంగా గంధంచెట్లు, ఇతర విలువైన చెట్లూ కొట్టుకు పోవడం మామూలే. ఆఫీసర్లు కూడా ఒక్కోసారి కాంట్రాక్టర్ల దగ్గర లంచం తీసుకొని చూసి చూడనట్లు వూరుకోవడమో, తర్వాత ఆ చెట్లని "డెడ్ వుడ్"గా రైట్ ఆఫ్ చెయ్య డమూ జరుగుతుంటుంది.

ఇప్పుడా నల్లమద్ది దుంగల్లో వున్న గంధపుమాను బరువు అరటన్నుకు తక్కువ వుండదు. అంటే దానివిలువ దాదాపు రెండు వేలన్నమాట. దొంగతనాన్ని చూస్తూ వూరుకోవడానికి మనసొప్పలేదు. నీళ్లోకి దిగి ఆ దుంగల్ని ఒడ్డుకు లాగమని చెప్పాను, అబ్దుల్లాతో.

అబ్దుల్లా సందేహిస్తూ నిలబడ్డాడు. "అవి మన అడవి

కలపకాదని తెలిసి..." అంటున్నాడు.

"గో ఆన్! స్టాపిట్!" అరిచాను కోపంగా.

ఆ దుంగల కట్టు మెల్లిగా ఒడ్డమ్మట ముందుకు కదుల్తోంది. అబ్దుల్లా చకచకా బట్టలు వూడదీసి డ్రాయర్తో నీళ్ళలోకి దిగాడు. ఈదుకొంటూ వెళ్ళి ఒడ్డుకు దగ్గరగా వస్తోన్న ఆ దుంగల్ని కట్టు దగ్గరపట్టుకొని ఒడ్డువైపు తిప్పాడు. ఎంత బరువైన వస్తువైనా నీటిలో తేలుతున్నప్పుడు పట్టుకోవడం బహు తేలిక. అదే ఒడ్డుమీద అయితే అబ్దుల్లా లాంటి వాళ్ళు పదిమందయినా దాన్ని ఎత్తగలిగి వుండే వాళ్ళు కారు.

జానీ గబగబ చెట్లకు చుట్టుకొని వున్న అడవితీగల్ని తెంపి తాడులా చేసి అబ్దుల్లా వైపు విసిరాడు. అబ్దుల్లా దాన్ని దుంగలకు బిగించాడు. జాని ఆ తాడులాగుతోంటే ఆ దుంగలు గడ్డిపరకల్లా తేలుతూ వచ్చాయి ఒడ్డుకు. వాటిని నీటిలోనే వుంచి తీగల్ని ఓ చెట్టుకు కట్టేశాడు జాని.

నాలుగు నల్లటి మద్ది దుంగల మధ్య స్పష్టంగా కనిపిస్తోంది, లేత పసుపు రంగు గంధపు దుంగ. అబ్దుల్లా ఒళ్ళు ఆరబెట్టుకొంటూ నిలబడ్డాడు.

"ఇప్పుడేం చేద్దాం సార్?" అడిగాడు జాని.

"ప్రస్తుతం చేసేదీ ఏంలేదు. ఆఫీసుకు వెళ్ళగానే కర్నాటక అడవి ఆఫీసరుకు ఫోన్ చేస్తాను. వాళ్ళే వచ్చి రికవర్ చేసుకొంటారు. ఆఫీసరు కేసుపెడితే కంట్రాక్టరు టెండరు కాన్సిల్ అయిపోతుంది. డిపాజిట్ మనీ పోతుంది." అన్నాను సిగరెట్ వెలిగించి నిదానంగా పొగవదుల్తూ ఆ చందనం దుంగవంకే చూస్తూ. దుంగల మీద తారుతో ఏదో గుర్తులు వున్నాయి.

"సార్!"—అన్నాడు అబ్దుల్లా.

ఏమిటన్నట్లు చూశాను.

"ఆ దుంగలమీద గుర్తులు చూశారా? పి. జె. అనే అక్షరాలు"_అన్నాడు అబ్దుల్లా ఫాంటు తొడుక్కుంటూ.

"అయితే?"

"అవి కలప కాంట్రాక్టరు గుర్తులు. చూస్తోంటే అది జాలయ్య కాంట్రాక్టులా వుంది.

"జాలయ్య కాంట్రాక్టా?"

"అవునుసార్, పింజల జాలయ్య. పూజారి మహాలింగం తమ్ముడు" అన్నాడు అబ్దుల్లా భయం భయంగా.

"పాపం! వాడి కంట్రాక్టు పోవడం ఖాయం" అన్నాను వెనక్కి తిరుగుతూ. కాని, నా మాటలు అబద్ధమని ఋజువు కావడానికి ఎంతో కాలం పట్టలేదు.

3

"సార్!" అన్నాడు జానీ గదిలోకి దూసుకువస్తూనే. మధ్యాహ్నం పన్నిండు కావస్తోంది. ఆఫీసులో కరెంటు లేక ఫాన్ పనిచెయ్యక పోవడంవలన ఉక్కగా, చిరాగ్గా వుంది. బయటవరండాలో క్లర్కు, టైపిస్టు, గార్డులు చేసే పని లేక కబుర్లు చెప్పుకొంటున్నారు. నేను కూడా చేసేపని లేకపోయినా నా హోదా నిలబెట్టుకోవాలి కాబట్టి ఆఫీసుగదిలో కూర్చొని నిన్నటి దినపత్రిక తిరగేస్తున్నాను.

నేను పేపరు ప్రక్కకు పారేసి ఏమిటన్నట్లు చూశాను జానీ వంక. ఎండలో నడిచివచ్చేడేమో చెమటలు ముఖం మీదకు ధారగా కారుతున్నయ్. త్వరగా వచ్చి వుండాలి బాగా ఆయాసపడుతున్నాడు.

"సార్, ఉత్తరం వైపు అడివిలో రెండు గంధపు చెట్లు పట్టుకెళ్ళి పోయారుసార్ ఎవరో." అన్నాడు జానీ రొప్పుతో.

"వాట్!" అన్నాను చటుక్కున లేచి నిలబడుతూ.

"అవును సార్ ఇందాక రొటీన్‌గా అటువైపు చెకింగ్‌కు వెళ్ళాను సార్ ఏరు ఒడ్డునే. నిన్న మనం వెళ్ళిన చోటుకి చాలా ఎగువున, దాదాపు నాలుగు మైళ్ళపైన, రెండు చెట్లుకొట్టేసి వున్నాయి సార్. చిన్న కొమ్మ కూడా మిగల్చకుండా పట్టుకెళ్ళి పోయారు" అన్నాడు జానీ ఇంకా ఆయాసపడుతూనే.

"వివరంగా చెప్పు." అన్నాను రాక్‌లో నుండి యాంకిల్ బూడ్సులు తీసుకొని తొడుక్కొంటూ.

"ఉత్తరం వైపున నదిఒడ్డునే దాదాపు ఓపాతిక చెట్లు మరో సంవత్సరంలో మెచ్యూర్ అయేవి వున్నయి సార్. వాటిలో రెండుచెట్లు ఎవరో కొట్టుకెళ్ళి పోయారు. పూర్తిగా మొదళ్ళలోకంతా రంపాలతో కోసి తీసుకు పోయారు. బహుశా రాత్రి చీకటి పడింతరువాత చేసుంటారు సార్!" అన్నాడు జాని.

నేను బూట్సులు వేసుకోవడం ముగించి ఫీల్డ్ ఓవరు కోటు తీసుకొని బయటకు నడిచాను. జానీ నావెనకే బయటికి వచ్చాడు. వరండాలో వున్న మరో ఇద్దరు గార్డ్సును వెంట రమ్మని పిలిచాను, జీపు దగ్గరికి వెళుతూ.

"అక్కడికి జీపు తీసుకెళ్ళే అవకాశం వుందా?" అడిగాను ఎక్కి కూర్చుంటూ.

"ఉందిసార్! అడవిచుట్టూ తిరిగి వెళ్ళాలి" అన్నాడు జాని. వాళ్ళ ముగ్గుర్ని ఎక్కమన్నట్లు సైగచేసి జీపుస్టార్ట్ చేశాను. సూర్యుడు నడినెత్తిన తన ప్రతాపాన్ని చూపెడుతున్నాడు.

"ఎవరు కొట్టుకెళ్ళి వుంటారో నీకేమయినా ఐడియా

వుందా. రెండు చెట్లను రాత్రికి రాత్రి మొదళ్ళతో సహా నరికేసి మాయంచేసి తీసుకుపోవడం అంత తేలికైన పనికాదు.'' అన్నాను ఓ చేత్తో జీప్ వీల్ ని బాలన్స్ చేస్తూ రెండో చేత్తో సిగరెట్ వెలిగించుకొని.

''దానికేముంది సార్! ఏరుప్రక్కనే చెట్టే కాబట్టి, నరికి నీళ్ళలో కట్టకట్టి వదిలేస్తే దిగువ నెక్కడో వాళ్ళకు అనుకూలమైన ప్రదేశంలో ఒడ్డుకులాగి దాచేస్తారు'' అన్నాడు జీపులోవున్న మరో గార్డు మునిస్వామి.

హఠాత్తుగా నాకో ఆలోచన స్ఫురించింది. ''జాలయ్య మనుషులు అక్కడికి ఎంత దూరంలో వున్నారు'' అన్నాను ఎత్తుపల్లాలలో జీపు ఎగిరి పడకుండా స్టీరింగ్ కంట్రోలు చేస్తూ.

ఒక్కక్షణం ఎందుకో జీపులో నిశ్శబ్దం ఏర్పడినట్లనిపించింది. తల త్రిప్పి ముందుసీట్లో నా ప్రక్కనే కూర్చొన్న జానీ ముఖంలోకి చూశాను. ఎందుకో ఎర్రని ఎండలోనూ జానీ ముఖం పాలిపోయినట్లనిపించింది.

''వెల్! ఎంతదూరం?'' అన్నాను కాస్త గట్టిగా.

''ఏటి కవతల మన చెట్లు కొట్టేసిన ప్రదేశానికి ఎదురుగానే సార్. ఏటి కవతల నిలబడితే వాళ్ళ వర్క్ టెంట్లు అవీ కనబడుతునే వున్నాయి.'' అన్నాడు జానీ చివరికి.

జాలయ్య! అనుకొన్నాను మనసులోనే. నోట్లోవున్న సిగరెట్ పొగ కంట్లోకిపోయి నీళ్ళు ఉబుకుతున్నాయి. సిగరెట్ తీసి బయటకు విసిరేశాను. నిన్న వాడి దొంగతనాన్ని పట్టించినందుకు ప్రతీకారంగా ఈపని చేశాడా? ప్రభుత్వాన్ని మోసంచేసి ఎదిరించే మొనగాడా ఈ జాలయ్య?

"అవును సార్! ఇది ఆ జాలయ్యా మనుషులపనే అయ్యుండాలి. మీరు నిన్న వాడి దుంగల్ని బయటికి లాగి వాళ్ళ ఆఫీసరు గారికి రిపోర్టు చేశారని కోపంతో ఈపని చేయించి వుండాలి వాడు" అన్నాడు మునుస్వామి.

నేను మాట్లాడలేదు. పెదిమలు బిగించి ముందు దారి మీదే దృష్టి వుంచాను.

"కుడి ప్రక్కకు తిప్పి ఏటిఒడ్డునే పోనివ్వండిసార్!" అన్నాడు జానీ. మరో పదినిముషాల్లో జీపు ఆపి క్రిందికి దిగాను. జానీ చెప్పనవసరం లేకుండానే చెట్లు కొట్టేసిన ప్రదేశం స్పష్టంగా కనిపిస్తోంది. భూమికి అరంగుళాలపైన లేత పసుపు పచ్చరంగు మొండాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తోన్నాయి.

జీపుదిగి అవతలి ఒడ్డుకేసి చూశాను. జాలయ్యా మనుషులు కట్టలుగా కట్టిన దుంగల్ని ఏట్లోకి దొర్లిస్తున్నారు. ఏటి ఒడ్డునే ఖాకీ కాన్వాసులో వేసిన గుడారాలు నాలుగైదు వున్నాయి. వాటివెనుక చెట్లు నరికేసిన భాగమంతా మొండిగా, బోసిగా. విశాలంగా కనిపిస్తోంది.

అవును, ఇది జాలయ్యా మనుషులపనే అయ్యుండాలి. రాత్రి పూట ఏరుదాటివచ్చి ఈ చెట్లు కొట్టేసి తమ దుంగలతోపాటు వాటిని ఏట్లోకి దొర్లించడం వాళ్ళకు కష్టమయిన పనేమీకాదు. వెనక్కు తిరిగి చెట్ల మొండాల దగ్గరికి వెళ్ళాను.

పచ్చగా, లేత పసుపు మాను కనిపిస్తూ, జాలిగా వున్నాయి ఆ రెండు గంధపు చెట్ల మొదళ్లు. నూట పన్నెండు, నూటపదమూడు అనుకొన్నాను మనసులోనే ప్రక్కనే వున్న చెట్ల నంబర్లు చూచుకొని. అన్నీ మెచ్యూర్ చెట్లే. అంటే ఒకో చెట్టూ దాదాపు మూడు టన్నుల

పైన బరువుంటుంది. రెండు చెట్లను ఎంత అధమంగా లెక్కవేసినా ఇరవై వేల రూపాయల విలువను తక్కువ వుండదు.

'జాలయ్యా. నిన్నువదిలేది లేదు' అనుకొన్నాను మనసులోనే కోపంగా. "సార్!" అన్నాడు. మును స్వామి.

'ఏమిటన్నట్లు' చూశాను. అవతలిగట్టువైపు చూడ మన్నట్లు సైగ చేశాడు.

భారీ విగ్రహం. పెద్దపొట్ట, మల్లు పంచె, మల్లులాల్చీ, బుజంమీద ఎర్రంచున్న కండువా, చుట్ట కాలుస్తూ, ఒక చెయ్యి నడుంమీద పెట్టుకొని, దర్జాగా నిలబడి మావైపే చూస్తున్నాడు వాడు. వాడి వెనక నలుగురయిదు గురు మనుషులూ మావైపే చూస్తున్నారు.

"వాడే సార్ జాలయ్య" అన్నాడు జానీ గుసగుసలుగా, గట్టిగా చెబితే వాడికి ఎక్కడ వినిపిస్తుందోనన్నట్లు.

నేను తీక్షణంగా వాడివైపే చూస్తూన్నాను. వాడేదో అన్నాడు చుట్టపొగ వదులూ. పక్కనున్న వాళ్ళు నా వైపే చూస్తూ పగలబడి నవ్వుతున్నారు. నాకు తలలోకి రక్తం తన్నుకొస్తున్నట్లు కనిపించింది. గార్డ్సు ముగ్గురి కళ్ళు నామీదే వున్నాయని తెలుసు. వాళ్ళుపైకి మౌనంగా వున్నా మనసుల్లో నన్ను చూసి నా నిస్సహాయత చూసి జాలి పడుతున్నారని, నవ్వుకొంటున్నారని తెలుసు.

"లెటజ్ గో," అన్నాను వెనక్కి తిరిగి జీపులో కూర్చొని స్టార్ట్ చేస్తూ.

4

ఆఫీసుదగ్గర ఇద్దరుగార్డుల్ని దించేసి, మునుస్వామిని మాత్రం వుంచుకొని తిన్నగా మీసాలపల్లె వెళ్లాను.

మీసాలపల్లె, శివపురికి పదిమైళ్ళ దూరంలో వున్న ఓ మోస్తరు_టౌను. శివపురికూడా మీసాలపల్లె సర్కిల్ లోకి వస్తుంది. జరిగిన దొంగతనాన్ని వెంటనే రిపోర్టుచేసి, తగిన చర్యలు తీసుకొనేలా చూడడం నా బాధ్యత.

మీసాలపల్లె టౌన్ ఇన్‌స్పెక్టర్‌కు నన్ను నేను పరిచయం చేసుకొని జరిగిన విషయాన్ని విపులంగా చెప్పాను.

"ఇలాంటి సంఘటనలు ఇక్కడ అడవుల్లో మామూలే కాని ఒక్కసారి ఇలా రెండు చెట్లు, ఫారెస్టు ఆఫీసరుకి తెలియకుండా కొట్టుకు పోవడం ఇదే మొదటిసారి" అన్నాడు మీసాలపల్లె ఇన్‌స్పెక్టరు అంతావిని.

"అవును, మీరు వెంటనే ఈ విషయంలో చర్య తీసుకోవాలి. చెట్లునరికిన ప్రదేశానికి ఎదురుగానే జాలయ్యా తాలూకు పనివాళ్ళు కర్నాటక అడవి నరుకుతున్నారు. రాత్రిపూట ఏరుదాటి చెట్లు నరికెళ్ళడం వాళ్ళ కేమంత కష్టమయిన పనికాదు." అన్నాను.

ఇన్‌స్పెక్టర్ ముఖంలో ఒక్కక్షణం ఆశ్చర్యం కనిపించింది. "జాలయ్యా మనుషులా? అలా అయితే మేం చేయగలిగింది బహుతక్కువ" అన్నాడు.

"ఎందుకని?" నాలో కోపం మళ్ళీ రాజుకొంటోంది.

"వాళ్ళు ఏరుఅవతల పనిచేస్తున్నట్లయితే వాళ్ళని మేమేం చెయ్యలేము. ఆ ప్రదేశం మా జూరిష్‌డిక్షన్‌లోకి రాదు. ఈ విషయం కర్నాటక పోలీసులకు తెలిపి వాళ్ళను పట్టుకోమనో, హెచ్చరించమనో చెప్పగలం. అంతే" అన్నాడు ఇన్‌స్పెక్టర్, ఇహ అంతకు మించి ఆవిషయం మీద చర్చించటం కాలంవృధా చెయ్యడమే అనే అర్థాన్ని స్ఫురించేలా.

"ఇంక మనం చెయ్యగలిగింది ఏమీ లేదంటారా?"

అన్నాను లేచి నిలబడుతూ.

"ఎందుకు లేదు? వాళ్ళను రెడ్ హాండెడ్ గా పట్టు కొంటే వాళ్ళ ఏరాష్ట్రానికి చెందిన వాళ్ళయినా కేసు పెట్టి శిక్ష వెయ్యించవచ్చు" అన్నాడు ఇన్స్పెక్టర్ నవ్వుతూ అదోలా.

"ఐసీ...మీరు దయచేసి వెంటనే కర్నాటక పోలీసు లకు తెలియజేయండి. పోయిన కలప దొరుకుతుందని నమ్మకం లేకపోయినా, కనీసం పోలీసులొకసారి ఈ విషయం కదిపిచూస్తే వాళ్ళకు కాస్త భయమన్నా వుంటుంది" అన్నాను.

"రైటో! ఐవిల్ డు దట్!" అన్నాడు ఇన్స్పెక్టర్ లేచి నన్ను జీపు వరకూ సాగనంపుతూ.

తిరిగి శివపురి తిరిగివచ్చేప్పటికి సాయంత్రం అయింది. ఆఫీసులో స్టాఫంతా వెళ్ళిపోయారు. అబ్దుల్లా, మరో గార్డు శంకర్ నైట్ వాచ్ కోసం అప్పుడే ఫారెస్టు బంగళాకు బయలుదేరుతున్నారు.

నిజానికి అంత పెద్ద అడవిలో ఎవరూ చెట్లూ అవీ కొట్టుకుపోకుండా కాపలా కాయడానికి నలుగురు గార్డ్సు చాలరు. వుండేవాళ్ళు పేరుకుమాత్రమే. పైగా నైట్ వాచ్ కళ్ళే గార్డుపనికి అసలు అర్థంలేదు. ఫారెస్టు బంగళాలో మధ్య రాత్రివరకూ కబుర్లు చెప్పుకొని నిద్రపోతారు. అంతరాత్రిలో వాళ్ళను అడవంతా తిరుగుతూ కాపలా కాయమనడం, మేలుకొని వుండమనడంలో అర్థంలేదు. పగలే ఆ అడవిలో తిరగడం కష్టం. ఇక రాత్రుళ్ళు తిరగడంలో అర్థంలేదు.

"అబ్దుల్లా!" పిలిచాను. వాళ్ళిద్దరూ దగ్గరికి వచ్చారు.

"ఈరోజు మీరిద్దరూ ఓపని చెయ్యండి. ఆఫీసులో నుండి టెంట్, కాంప్ కాట్లు తీసుకెళ్ళండి. ఆ జాలయ్య

గాడి ముఠాను ఎదురుగా ఏటి ఒడ్డునే టెంటు వేసుకొని, రాత్రంతా టర్న్ డ్యూటీ చెయ్యండి" అన్నాను.

"ఇప్పుడు టెంట్ వెయ్యడమా? బంగళా కెళ్ళే టప్పటికే చీకటిపడిపోతుంది సార్. రేపు వేద్దాం లెండి" అన్నాడు అబ్దుల్లా.

"డోన్ట్‌వర్రీ! నేను జీపులో డ్రాప్ చేస్తాను"– అన్నాను ఆఫీసులోకి నడుస్తూ.

ఏటి ఒడ్డు కెళ్ళి టెంట్ వేసేప్పటికి ఏడు దాటింది. మేం టెంటు వేస్తోంటే జాలయ్య ముఠా వాళ్ళంతా మమ్మల్ని వింతమృగాల్లా చూస్తూ నిలబడ్డారు.

5

తర్వాత మూడు రోజుల వరకూ ఏ సంఘటనా జరగ లేదు. గంధపుచెట్లు కొట్టుకుపోయిన వాళ్ళనుగురించి ఏ సమాచారం తెలియలేదు. మధ్యలో ఓసారి మీసాలపల్లె ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేశాను. దొంగల గురించి ఏమీ సమాచారం తెలియలేదన్నాడు.

టెంట్లో వుండి నైట్ డ్యూటీ చెయ్యడానికి గార్డులు అయిష్టత చూపిస్తున్నారు. ఏటిఅవతల జాలయ్య ముఠా పని ఆపేయడంతో మరో రెండు రోజులు చూసి టెంట్ తీసేసి, మామూలు ప్రకారం డ్యూటీ చెయ్యమని చెప్పాను.

మర్నాడే మునుస్వామి మళ్ళీ వార్త మోసుకొచ్చాడు మరో రెండు చెట్లు నరికి తీసుకుపోయారని. ఈసారి నిజంగా పిచ్చెక్కినట్లయింది నాకు. ఎలా అయినా కాపు కాసి వాళ్ళను పట్టుకోవాలని నిశ్చయం చేసుకొన్నాను. ఆరోజు రొటీన్‌గా పోలీస్ రిపోర్టు ఇచ్చి ఏమీ పట్టనట్లు వూరుకొన్నాను. నేనేం చెయ్యదలచుకొన్నది చివరి క్షణం వరకూ ఎవరికీ చెప్పదలుచుకోలేదు.

రాత్రి ఎనిమిది గంటలకు భోజనం ముగించుకొని, పిస్టోలులోడ్ చేసుకొని జీపుతీసుకొని ఫారెస్టు బంగళాకు వెళ్లాను.

మునుస్వామి, జానీ, బంగళా వాచ్ మెన్ ముగ్గురూ సిగరెట్లు కాలుస్తూ వరండాలో గాస్ లైటు వెలుతుర్లో పేకాడుకొంటున్నారు. జీపు ఆగగానే ముగ్గురూ హడావిడిగా లేచి జీపు దగ్గరికొచ్చారు.

"ఏమిటి సార్. ఈ వేళప్పుడొచ్చారు" అన్నాడు మునుస్వామి ఆశ్చర్యంగా. చిన్నగా నవ్వాను. "వెంటనే బూట్లు వేసుకొని, రైఫిల్స్ సరిగ్గా వున్నయ్యో లేదో చెక్ చేసుకోండి. ఈ రాత్రికి ఏటిఒడ్డున కాపలా వేసి ఎలా అయినా ఆ దొంగ వెధవల్ని పట్టుకోవాలి" - అన్నాను.

క్షణంపాటు నోటమాట రానట్లు నిలబడి పోయారు వాళ్ళు. "నువ్వుకూడా యూనిఫారం వేసుకో. మాతో రావాలి" అన్నాను బంగళా వాచ్ మెన్ తో.

చకచక తయారయి జీపులో ఎక్కి కూర్చొన్నారు ముగ్గురూ. "సారీ. నో వెహికల్. నడిచివెళదాం, మనం అక్కడికి వచ్చినట్టు తెలిస్తే వాళ్లెవరూ దొరకరు" అన్నాను.

ముగ్గురూ మాట్లాడకుండా జీపు దిగారు. వాళ్ళు మనసులో నన్ను తిట్టు కొంటున్నారని తెలుసు. నాలుగు గంధంచెట్లు పోయినంత మాత్రాన, నాకు, ప్రభుత్వానికి వచ్చే నష్ట మేమిటని వాళ్ళు అనుకుంటూ వుండొచ్చు. చట్టం యొక్క మంచిచెడ్డలు వాళ్ళు తర్కించలేరు మరి.

అడ్డతోవని వెళితే నాలుగు మైళ్ళంటుంది, నేను కాపుకాయ దలచుకొన్న ప్రదేశం. ఎంతనిశ్శబ్దంగా వున్నా

నడుస్తోంటే ఆకులు, ఎండిన కొమ్మలు బూట్సులక్రింద పడి నలిగి చప్పుడు చేస్తున్నాయి. ఫైవ్ సెల్స్ టార్చితో దారి చూపిస్తూ ముందు నడుస్తున్నాడు మునుస్వామి, అతని వెనకే ముగ్గురం నడుస్తున్నాం.

జీపులో నేను తీసుకొచ్చిన సామాను చూసి వాళ్ళు మొదట ఆశ్చర్యపోయారు. రెండు పెద్ద తాడుచుట్టలు, కాగడాలు, ఆముదం టిన్ను, పెద్దఫ్లాస్కు. అందరూ తలా ఒకటి తీసుకొన్నారు.

"చీకటి వేళ అడ్డం పడి వాళ్ళను ఆపలేం సార్. జాలయ్య మనుషులు ప్రాణాలకు తెగించిన దుర్మార్గులు. తామేంచేసినా జాలయ్య తర్వాత తనడబ్బుతో, పలుకుబడితో తమను కాపాడుతాడని వాళ్ళ నమ్మకం" అన్నాడు జాని.

'చూద్దాం! అదీ చూద్దాం. వాళ్ళు దొరకడం గాని జరిగితే ఒక్కొక్కడికి రెండేళ్ళకు తక్కువగా కుండా జైలు పడేట్లు చూస్తాను," అన్నాను కసిగా.

"ఏమోసార్! నాకు భయంగా వుంది. ఆ జాలయ్య, వాడి అన్న మహాలింగం బహు దుర్మార్గులు. ఈ చుట్టు ప్రక్కల వాళ్ళకు ఎదురు చెప్పేవాళ్ళు లేరు. అయిదేళ్ళ క్రితం ఓ ఆఫీసరుగారిలాగే జాలయ్య దగ్గరుండి కోతుల్ని పడుతుంటె పట్టుకొని కేసుపెట్టాడు. చివరికి కోర్ట్లో కేసు కొట్టేశారనుకోండి. పాపం, ఆ ఆఫీసరుగారు మాత్రం మహాలింగం చేతబడివల్ల రెండు నెలల్లో చిక్కి శల్యమయ్యాడు. చివరికి ఊళ్లో వాళ్ళందరూ చెప్పగా, భార్య పోరుపడలేక జాలయ్య కాళ్ళమీద పడి క్షమాపణ చెప్పుకొని అడవిలో నాలుగు గంధం చెట్లు కొట్టుకో నిచ్చిన తరువాత గాని చేతబడి దిప్పలేదు" అన్నాడు జాని.

ఎందుకో ఒక్క క్షణం గుండె జల్లుమంది. "నాన్ సెన్స్!" అన్నాను కోపంగా.

ఏటి ఒడ్డుకు చేరేటప్పటికి పది దాటింది. ఏటి ఒడ్డునే నడుచుకొంటూ గంధపు చెట్లవైపు నడిచాము. హఠాత్తుగా దూరంలో వెలుగు కనిపించింది. లీలగా మిషన్ ఆడుతున్న చప్పుడు వినిపిస్తోంది.

గార్డ్స్ ఇద్దర్నీ రైఫిల్స్ లోడ్ చెయ్యమని చెప్పాను. 22 స్టాండర్డ్ ట్రైనింగ్ రైఫిల్స్ అవి. చూడ్డానికి కంటికి నిండుగా కనిపించినా పిట్టల్ని కాల్చడానికి తప్ప దేనికీ పనికిరావు. ఎఫెక్టివ్ రేంజి రెండు వందల మీటర్లు. మజిల్ వెలాసిటీ చాలా తక్కువ. ఎఫెక్టివ్ రేంజిలో మనిషికి గురిచూసి కాల్చినా, రొమ్ము భాగంలో తగలక పోతే ఏం ప్రమాదం జరగదు. అయినా సామాన్య ప్రజలకు రైఫుల్స్ గురించి పెద్దగా తెలియదు గనుక భయపడ్డం సహజం.

మునుస్వామి, జాని సందేహిస్తూనే రైఫిల్స్ లోడ్ చేసారు. సెఫ్టీ కాచ్ ఆన్ చేసి వుంచమని చెప్పాను. తుపాకి చేతిలో వున్నా నర్వెస్ గా ఫీలవుతున్నారు వాళ్ళు- సెఫ్టీ కాచ్ ఆన్ అయివుంటే పొరపాటున ట్రిగ్గర్ కు వేలు తగిలి పేలవచ్చు.

"చప్పుడు చేయకుండా ముందుకు నడవండి. టార్చి లైటు వెలిగించకండి - వెధవలు అప్పుడే పని మొదలు పెట్టినట్లున్నారు" అన్నాను నడుముకున్న కేసునుండి పిస్తోలు తీసి పట్టుకొని ముందుకు నడుస్తూ.

నా వెనకే వాళ్ళు ముగ్గురూ అడుగులో అడుగు వేసుకొంటూ చప్పుడు చెయ్యకుండా నడుస్తున్నారు. వెలుతురుగా వున్న ప్రదేశం ఇంకా ఓ ఫర్లాంగు దూరంలో

వుంది. ఏటి ఒడ్డునే వెలుగుతోన్న రెండు పెట్రోమాక్సు లైట్లు కనిపిస్తోన్నయ్. మనుషులు అటూ ఇటూ తిరుగుతున్నట్లు లీలగా ఆకారాలు కనబడుతున్నయ్.

ముందుకు నడుస్తున్న వాణ్ణల్లా చటుక్కున ఆగిపోయాను. ఏటి ఒడ్డునే ఎదురుగా ఓ వందగజాల దూరంలో చటుక్కున ఓ అగ్గిపుల్ల వెలిగింది. అగ్గిపుల్ల వెలుతుర్లో బీడీ ముట్టించుకుంటున్న మనిషి ముఖం కనిపించింది.

మొత్తానికి వీళ్ళు అన్నీ పకడ్బందిగానే చేస్తున్నారు అనుకొన్నాను. పొరపాటున మేమెవరన్నా వస్తే చూచి హెచ్చరించడానికి సెంట్రీలా పెట్టారు కామాల్ను. నా వెనక వస్తున్న ముగ్గుర్నీ ఆగమన్నట్లు సైగచేశాను. దూరాన రంపం మిషను మోత తప్ప ఏమీ వినిపించడం లేదు.

ఎదురుగా వెళితే వాడు మమ్మల్ని గుర్తుపట్టి వాళ్ళను హెచ్చరించక మానడు. అగ్గిపుల్ల వెలుగునుబట్టి వాడు మా వైపే తిరిగి వున్నాడని గ్రహించాను. ఏదోరకంగా వాడి వెనకవైపుకు వెళ్ళి వాడిని అరవకుండా బంధించగలిగితే ప్రస్తుతానికి సమస్య తీరుతుంది.

మిగిల్న ముగ్గుర్నీ చెట్ల నీడల్లోకి జరగమని చెప్పి, నేను అడుగులో అడుగు వేసుకుంటూ చెట్ల వెనక్కి నడిచాను. చెట్ల వెనకనుండి నిశ్శబ్దంగా నడుచుకొంటూ వాణ్ణి దాటేటప్పటికి దాదాపు పావుగంట పట్టింది నాకు.

మెల్లిగా చెట్ల వెనకనుండి అడుగులో అడుగు వేసుకొంటూ పిల్లిలా వాడి వెనక్కి నడిచాను. చీకట్లో లీలగా నీడలా కనిపిస్తోంది సెంట్రీ ఆకారం. చెట్ల నీడల్లోంచి వాళ్లు ముగ్గురూ ఊపిరి బిగపట్టి చూస్తున్నారని

తెలుసు. సెంట్రీకి, నాకు మధ్య ఇంకా రెండడుగుల దూరమే వుంది. చేతిలో పిస్తోలు పిడివైపుకు తిప్పి పట్టుకొని వాడివైపు అడుగువేశాను.

ఓ రాతిమీద కూర్చొని విశ్రాంతిగా సిగరెట్ తాగుతున్నాడు వాడు. చివరి క్షణంలో పసిగట్టి వుండాలి వాడు వెనకెవరో వున్నట్టు. చటుక్కున వెనక్కి తిరిగాడు. అలస్యం చెయ్యలేదు నేను. పిస్తోలు పిడితో బలంగా నడిగె త్తిన మోదాను.

స్పృహ పోలేదు వాడికి. కాని హఠాత్తుగా పడిన దెబ్బకు దిమ్మతిరిగి క్షణంపాటు మతి చెదరివుండాలి. నెత్తి మీద చేతులు పెట్టుకొని పెద్దగా మూలుగుతూ క్రింద కూలబడ్డాడు.

సందేహించలేదు నేను. పిస్తోలు వాడి కణతలో ఆనించి, మెడ చుట్టూ చేయివేసి బిగించి పట్టుకున్నాను.

"అరిచావా! ప్రాణాలు పోతయ్!" అన్నాను చెవి దగ్గరగా నోరు పెట్టి.

వాళ్ళు ముగుస్తూ పరిగెత్తుకొంటూ వచ్చారు. క్షణాల్లో వాడి నోట్లో గుడ్డలు కుక్కి వాణ్ణి చెట్టుకు కట్టేశారు.

స్పృహ పోకపోయినా గట్టిగానే తగిలి వుండాలి నేను కొట్టిన దెబ్బ...మూలగడం తప్ప ఎదురు తిరగడానికి ఏ మాత్రం ప్రయత్నం చెయ్యలేదు. మాడు చిట్లి రక్తం కారుతోంది.

వాణ్ణక్కడ వదిలేసి మళ్ళీ ముందుకు కదిలాము.

6

బాలయ్య మనుషులు చేస్తున్న హడావిడి చూస్తే వాళ్ళకన్నా బందిపోటు దొంగలు నయమనిపించారు నాకు. దేదీప్యమానంగా వెలుగుతోన్న నాలుగు పెట్రమాక్స్

తోట వెలుతుర్లో మరో రెండు గంధపు చెట్లను మొదళ్ళ నుండి పెళ్ళగించే ప్రయత్నం జరుగుతోంది.

రెండు చెట్ల మానులకు అంగుళం లావు మోకులు బిగించి చెట్టు నరికినా పడిపోకుండా నాలుగు మూలలకూ పాతిన చెక్కముక్కలకు బలంగా కట్టారు. బ్యాటరీ సహాయంతో పనిచేసే 'ఎలక్ట్రిక్ సా' (మర రంపం) తో ముందుగా పెద్ద కొమ్మల్ని చెట్టునుండి కోసేస్తున్నారు.

మర రంపం కావడం వలన ఎంతలావు కొమ్మయినా నిముషాలలో తెగి క్రింద పడుతుంది. క్రిందపడిన కొమ్మల్ని కొందరు ప్రక్కకు లాగేసి మరో మర రంపంతో సైజుల వారీ ముక్కలుగా కోసి ఏట్లోకి దొర్లించడానికి సిద్ధం చేస్తున్నారు.

అంతా కలిసి పదిమంది వుంటారు. నల్లటి కోరమీసాల వాడొకడు ఓ గ్యాసులైటు ప్రక్కన నిలబడి మిగిలిన వాళ్ళందరికీ ఆర్డర్లు ఇస్తున్నాడు. బహుశా వాడు ముఠాకు నాయకుడై వుంటాడు. బాలయ్య మాత్రం పరిసర ప్రాంతాల్లో ఎక్కడా వున్నట్లు కనిపించలేదు. అఫ్‌కోర్స్. వుంటాడని నేను వూహించ లేదనుకోండి. అయినా ఎందుకో డిసప్పాయింట్ అయిన ట్లనిపించింది.

పదిమందిని పట్టుకోవడానికి నలుగురం. ఆయుధాలు వున్నా మంది ముందు ఆ చీకట్లో మా ఆయుధాల విలువ ఎంతుందో అంచనా వెయ్యడం కష్టం.

వాళ్ళకు దూరంగా చెట్లచాటున ఆగి ముందుగా కాగడాల్ని ఆముదంతో తడిపాను. రెండు కాగడాలు వాచ్‌మెన్ చేతి కిచ్చి పట్టుకోమన్నాను.

"జాగ్రత్తగా వినండి...హఠాత్తుగా వాళ్ళమీద దాడి చేసి నిరుత్తరుల్ని చెయ్యాలి మనం. తుపాకులు చూపించి

బెదిరించి ఎలా అయినా వాళ్ళను అదుపులోకి తేవాలి. మనల్ని చూసి పారిపోకుండా వుంచాలి వాళ్ళను...అంటే మునుస్వామి, వాచ్ మెన్ వాళ్ళకు వెనకవైపు గుండా రావాలి...ఏట్లోకి దూకి ఎవరూ పారిపోకుండా నేను చూసుకుంటాను.

"మునుస్వామీ! నువ్వు వాళ్ళ వెనక్కి వెళ్ళు. నీతో పాటు వాచ్ మెన్ వస్తాడు. నా పిస్తోలు ప్రేలిని శబ్దం వినబడగానే మరో క్షణం ఆగి నువ్వూ గాలిలోకి రైఫిల్ పేల్చు. వెంటనే వాచ్ మన్ కాగడాలు వెలిగిస్తాడు. హడావిడిలో వాళ్ళు లైట్లు ఆర్పేసినా కాగడాల వెలుతురుల్లో మన పని పూర్తి చెయ్యొచ్చు," అన్నాను గుసగుసలాడుతున్నట్లు.

మునుస్వామి, వాచ్ మెన్ లు తలవూపి చెట్ల చాటుకు మాయమయ్యారు. వాళ్ళు వెళ్ళిన పది నిముషాలకు నేను ముందుకు కదిలాను. జానీ నా ప్రక్కనే నడుస్తున్నాడు.

"జానీ! బి కేర్ ఫుల్! సేఫ్టీ కాచ్ ఆన్ చెయ్యి. కాల్చవలసిన అవుసరం వస్తే మోకాళ్ళ క్రిందికి కాల్చు. ఎవరికీ ప్రమాదకరమైన గాయాలు తగలడం నా కిష్టం లేదు" అన్నాను సీరియస్ గా.

"అలాగే సార్!" అన్నాడు జాని, అతని గొంతులో ఎక్సయిట్ మెంట్ స్పష్టంగా కనిపిస్తోంది.

చెట్ల వెనకనుండి నీడల్లా ముందుకు కదులుతున్నాము. ఆ ప్రదేశాని కెళ్ళేవరకూ చాటున వుండి హఠాత్తుగా వాళ్ళను సర్ ప్రయిజ్ చెయ్యాలని నా ప్లాను. చివరిచెట్టు వెనక ఆగిపోయాము. మునుస్వామి, వాచ్ మెన్ అవతల సెటిల్ అయ్యారో లేదో తెలియదు. చూస్తోంటే ఇంతవరకూ వాళ్ళను ఎవ్వరూ కనుక్కోలేదనే అనిపిస్తోంది.

"రడీ జానీ?" అన్నాను చెట్టుచాటునుండి అవతల జరుగుత న్న కోలాహలం చూస్తూ.

"రడీ సార్" అన్నాడు జానీ రైఫిల్ మీద చెయ్యి వేసి.

నేను పిస్తోలు ముందుకు చాచి పట్టుకుని చెట్టుచాటు నుండి ఏటి ఒడ్డున వున్న ఖాళీ ప్రదేశంలోకి పరిగెత్తాను. నా వెనకే జానీ పరిగెత్తుకొచ్చాడు. ఎండుటాకులు, కొమ్మలు మా బూట్ల క్రింద నలిగి పెద్దచప్పుడు చేసినయ్.

"ఏయ్! ఎవరది?" కోరమీసాలవాడు అరిచాడు.

రంపం మిషన్లు ఆగిపోయినయ్. పనిచేస్తున్న వాళ్ళంతా చటుక్కున మా వైపుకు తిరిగారు.

"ఢాం!" మ్మంటూ గాల్లోకి పేల్చాను పిస్తోలు. ఒక్క క్షణం అంతా నిశ్శబ్దం. దూరంగా చెట్లమీద పక్షులు గోలగా అరిచాయి. జాలయ్య ముఠావాళ్ళు బిత్తర పోయి నిలబడ్డారు.

"కదిలారంటే కాల్చి పారేస్తాను." అరిచాను గట్టిగా పిస్తోలు గాల్లో వూపుతూ.

అదే క్షణంలో వాళ్ళ వెనకవైపునుండి మునుస్వామి గాల్లోకి రైఫుల్ పేల్చాడు. వెంటనే గప్పుమని మంటతో రెండు కాగడాలు వెలిగినయ్.

"ప్రాణాలు పోగొట్టుకో దలచుకుంటే మీరున్న చోటునుండి కదలండి. మీ చుట్టూతా చెట్లచాటున రైఫుల్స్‌తో గార్డ్సు నిలబడి వున్నారు. పారిపోవాలని చూస్తే కుక్కల్ని కాల్చినట్లు కాలుస్తారు." అరిచాను పిస్తోలు కోరమీసాల వాడికేసి గురిచేసి.

"ఎవర్రా నువ్వు? ఎన్ని గుండెల్రా నీకు తుపాకి చూ పెట్టడానికి" అన్నాడు వాడు ఒకడుగు ముందుకు వేసి నా వైపు కదులుతూ.

వాడి ధైర్యానికి మనసులోనే అభినందించకుండా వుండలేకపోయాను, అయినా సందేహించలేదు. ట్రిగ్గర్ నొక్కాను.

'ఢాం!' మంది పిస్తోలు, కొరమీసాలవాడి కాళ్ళదగ్గర దుమ్ము మేఘంలా లేచింది. "మరో అడుగు ముందుకు పడితే ఈసారి గుండు మోకాల్లో దిగుతుంది ఖబడ్దార్" అరిచాను కోపంగా.

వాడు నమ్మలేనట్లు గుండు తగిలిన నేలవంకే చూస్తూ వుండిపోయాడు.

మునుస్వామి, వాచ్ మెన్ వాళ్ళకు వెనగ్గా వచ్చి నిలబడ్డారు.

"జానీ, గోఎహేడ్. అందర్నీ చెట్లకు కట్టేయ్," అన్నాను.

జానీ తాడుచుట్ట తీసుకొని ముందుకు కదిలాడు. అప్పటి వరకూ అలా ప్రతిమల్లా నిలబడిన వాళ్ళల్లో ఒక్కసారి చైతన్యం వచ్చింది. ఒకణ్నొకడు తోసుకొంటూ నలుగురు ఏటివైపు పరిగెత్తసాగారు.

చూస్తూ వూరుకొంటే పరిసితి చేయిదాటిపోతుం దని పించింది. పిస్తోలు గురిపెట్టి పరిగెత్తుతున్న వాళ్ళ కాళ్ళకు గురిచేసి చకచకా రెండు గుండ్లు కాల్చాను.

"అమ్మో!" అరిచా డెవడో.

"చచ్చాన్రోయ్! దేవుడోయ్" కేకపెట్టాడు మరొకడు.

పరిగెత్తిన నలుగుర్లో ఒకడు మాత్రం ఏట్లోకి వురికాడు, మిగిలిన ముగ్గురూ క్రిందపడి బాధతో మూల్గుతున్నారు, అరుస్తున్నారు.

జానీ ఏటివైపు పరిగెత్తబోయాడు. వద్దన్నట్లు వారించాను.

"ఇంకా ఎవరన్నా దూకదలచుకున్నవాళ్ళు ముందుకు రండి," అన్నాను కర్కశంగా దుమ్ములో పడి మూల్గుతున్న వాళ్ళను చూపెడుతూ. ఎవ్వరూ కదల్లేదు.

దూరంగా ఎక్కడో జీపులు వస్తున్న శబ్దం వినిపించింది. మరుక్షణం మొదటి జీపు హెడ్ లైట్ల కాంతి మా మీద బడింది.

"పోలీసులు" అరిచాడు మునుస్వామి.

"అవును. ఫారెస్ట్ బంగళాకి వచ్చేముందు సర్పంచ్ రాఘవను మీసాలపల్లె పంపించాను, రాత్రి పన్నెండు లోపల ఏదోరకంగా ఏటి ఒడ్డుకు పోలీసుల్ని తీసుకు రమ్మని."

7

మర్నాటి ఉదయానికి శివపురి, ఆ చుట్టుప్రక్కల పల్లెటూళ్ళన్నిటిలోనూ ఈ వార్త తెలిసిపోయింది. కుర్రకారు, కాస్త చదువుకొన్నవాళ్ళు నన్నభినందిస్తూ మాట్లాడుతుంటే, మిగిలిన ప్రజ జాలయ్యతో వైరం పెట్టుకొని నేనెంతోకాలం ఈ ఊళ్లో బ్రతకలేనన్న అభిప్రాయం వెలిబుచ్చారు.

ఉదయమే రాఘవ దగ్గరకు వెళ్ళి తను చేసిన సహాయానికి కృతజ్ఞతలు చెప్పాను.

"మరేం ఫరవాలేదు రంగా! పోలీసులు కూడా ధైర్యం చేసి చెయ్యాని పని మీరు చేశారు. ఈ ప్రాంతాల్లో ఈ జాలయ్య దుండగాలు మరీ మితిమీరుతున్నయ్. వాడి చేతికింద పనిచేసే మనుషులకు మరీ హద్దూ అయిపూ లేకుండా పోతున్నయ్. కాని మీరు మాత్రం కాస్త

జాగ్రత్తగా వుండండి. ఒంటరిగా తోడు ఎవరూ లేకుండా అడివికేసి వెళ్ళకండి.'' అన్నాడు రాఘవ.

అతని హెచ్చరికకు చిన్నగా నవ్వుకొన్నాను. జాలయ్యే తమని చెట్లు కొట్టమని పంపించినట్లు, ఆ రంపాలు, మిగతా పరికరాలు అతనివేననీ పట్టుబడిన పదిమంది దగ్గర స్టేట్‌మెంట్ తీసుకొనే ప్రయత్నం జరుగుతోంది. గాయపడి హాస్పిటల్లో వున్నవాళ్ళు, జైల్లో కూర్చొన్నవాళ్ళు, ఎవరూ నోరు విప్పడం లేదు.

''రాత్రి మనం పోలీస్ స్టేషన్ నుండి వచ్చేసింతరువాత స్టేషనుకు వాళ్ళ తరపున ఓ లాయరు వచ్చాడట. బహుశా తప్పించు కెళ్ళినవాడు వెళ్ళి చెప్పగానే జాలయ్య పంపించి వుంటాడు.'' అన్నాను ఉదయమే మునుస్వామి వచ్చి చెప్పిన విషయం చెపుతూ.

''పోనీలెండి! జాలయ్య దొరక్కపోయినా ఈ తొమ్మిది మందికీ జైలు పడటం ఖాయం,'' అన్నాడు రాఘవ సంతోషంగా.

కాని నా టార్గెట్ జాలయ్య మనుషులు కారు. జాలయ్య!! పదేళ్ళబట్టి శివపురి అడివిని, దేశ సంపదను దోచుకొని, ఎందరో ఆఫీసర్లను అవినీతిపరుల్ని చేసి, అవమానం పాలు చేసి, లక్షాధికారైన జాలయ్యను చట్టం ముందు నిలబెట్టడం నా ధ్యేయం.

ఎందుకో జాలయ్యకు, నాకు ఒకర్నొకరు తెలుసుకోకుండానే వ్యక్తిగత వైరం పెరిగిపోతుందనిపించింది.

ఉదయం అంతా ఆఫీసులో పై అధికారులకు రాత్రి జరిగిన సంఘటనల తాలూకు రిపోర్టులు పంపడంతో సరిపోయింది. మధ్యాహ్నం పన్నెండు గంటలకు మీసాల పల్లెనుండి ఓ పత్రికా విలేఖరి వచ్చాడు.

దొంగలను ఎలా పట్టుకొంది, ఏ రకంగా వాళ్ళను ఉచ్చుల్లో ఇరికించింది వివరంగా వ్రాసుకొన్నాడు ఆ విలేఖరి. మర్నాటికల్లా వివరాలన్నీ పేపర్లలో వస్తాయని తెలుసు నాకు. ఇలాంటి సంఘటనలకు పబ్లిసిటీ రావడం వల్ల, నా మీద అవినీతిపరులైన కొందరు పై అధికారులు, రాజకీయ వేత్తలు ప్రెషర్ తీసుకురాకుండా వుండే అవకాశం వుంది. అందుకే విలేఖరికి వివరాలన్నీ చెప్పాను.

చివర్లో జాలయ్యకు ఈ దొంగలతో ఏమన్నా సంబంధముందని తెలుసా అని చాలాసార్లు గుచ్చి గుచ్చి ప్రశ్నించాడు విలేఖరి. అవునని చెప్పడంవలన లీగల్‌గా బద్నామ్ అవుతానని తెలుసు. అంచేత ఆ విషయం నాకేమీ తెలియదని, పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారని సమాధానం చెప్పి పంపాను.

రెండు గంటలవేళ ఆఫీసు ముందు కారాగిన చప్పుడయింది. లేచి కిటికీలోనుండి చూశాను వచ్చిందెవరా అని. జాలయ్య లావుపాటి శరీరం కారులోనుండి బయటికొస్తూ కనిపించింది. చటుక్కున వెనక్కి తిరిగి నా కుర్చీలో కూలబడి చేతి కందిన ఫైలు తీసుకొని సీరియస్‌గా చదవడం మొదలుపెట్టాను.

బయట నలుగు రైదుగురు హడావిడిగా నడుస్తున్న చప్పుళ్ళు, నేనున్నానా అని ఎవరో అడగడం వినిపిస్తున్నాయి. సిగరెట్ తీసి వెలిగించుకొని విశ్రాంతిగా కూర్చున్నాను. గదిలోకి నలుగు రైదుగురు వచ్చిన శబ్దం అయింది. తలెత్తి చూశాను.

జాలయ్య, జాలయ్య వెనక మరో ముగ్గురు వస్తాదుల్లాంటి మనుషులు గది గుమ్మం దగ్గర నిలబడి నా వైపు

తీక్షణంగా చూస్తున్నారు. దూరం నుండి చూసినప్పుడు తెలియలేదుగానీ, దగ్గరగా ఆరడుగుల దూరంలో జాలయ్య ముఖంలో క్రూరత్వం, దర్పం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి.

వెడల్పయిన ముఖం, విబూదిబొట్టు, ఖద్దరు పంచె, లాల్చీ, భుజం మీద ఖద్దరు కండువా, ఎర్రంచు. మూడు మడతలు పడిన గవదలు, చిన్నకళ్లు, మొద్దు పెదిమలు, బానపొట్ట, దాదాపు ఆరడుగుల పొడవు, చేతి వేళ్ళనిండా వుంగరాలు. చూడ్డానికి చాలా అసహ్యంగా వున్నాడు జాలయ్య. అక్కడే నిలబడి లేచి వచ్చి నన్ను ఆహ్వానించవేం...అన్నట్లు చూస్తున్నాడు.

బల్లమీది బెల్ నొక్కాను. ప్యూను వాళ్ళకు దూరంగా తాకకుండా లోపలికి వచ్చి నిలబడ్డాడు.

"చూడు వీరన్నా! ఈ వచ్చిన వాళ్ళకు ఏం కావాలో బయటికి తీసుకెళ్ళి కనుక్కో" అన్నాను ప్రశాంతంగా.

"సార్..." అన్నాడు ప్యూను వీరన్న మతిపోయిన వాడికిమల్లే.

జాలయ్యకు క్షణంసేపు నోట మాట రాలేదు. తనంతటి బందిపోటు స్వయంగా వస్తే నేను ఇలా ప్రవర్తిస్తానని వాడు కల్లో కూడా అనుకొని వుండడు.

"ఇదిగో చూడు రంగనాథం..." ఏదో అనబోతున్నాడు జాలయ్య.

పట్టించుకోలేదు నేను. "వీరన్నా! చెప్పింది అర్థం కాలేదా? వచ్చినవారికి ఏం కావాలో బయటికి తీసుకెళ్ళి కనుక్కో" అన్నాను గట్టిగా.

ప్యూను వీరన్న సందిగ్ధంలోపడి వణికిపోతున్నాడు. జాలయ్య తీక్షణంగా వాణ్ణే చూస్తున్నాడు. జాలయ్య పలుకుబడికి, నా అధికారానికి ఇది ఓ రకంగా పరీక్ష.

చివరికి వీరన్న చేతులెత్తి దండం పెడుతూ "బాబుగారూ! బయటికి పదండి...పనేమిటో చెబితే అయ్యగారు తమర్ని లోపలికి పిలుస్తారు" అన్నాడు వణికే గొంతుతో దీనంగా.

ఆ క్షణంలో వీరన్న మీద జాలేసింది. పూర్ ఫెలో!

"ఎదురుగా వున్నప్పుడు మళ్ళీ నీకు చెప్పడ మెందుకురా...అతన్తో పనుండే వచ్చాను" అన్నాడు జాలయ్య గోడ పక్కనున్న కుర్చీలాగి నా టేబులు ముందు వేసుకూర్చుంటూ.

విషయాన్ని ఇంకా పొడిగించడం అనవసరమైన రభసకు దారి తీస్తుందనిపించింది.

"ఆల్ రైట్! ఎవరు మీరు? నాతో ఏం పని?" అన్నాను వాళ్ళ వంకే చూస్తూ.

"నే నెవరో తెలియకే అడుగుతున్నావా?" అన్నాడు జాలయ్య రెండు మోచేతులు ముందు టేబిల్ మీద ఆనించి ముందుకు వంగుతూ.

"ప్రతి మనిషీ కొన్ని ప్రాథమిక మర్యాదలు పాటించడం వివేకమైన విషయం. ముఖ్యంగా ఈ ఆఫీసులోకి అడుగు పెట్టిన మనుషులు——" అన్నాను జాలయ్య కళ్ళలోకే చూస్తూ.

ఉన్నట్టుండి పెద్ద పెట్టు గది ప్రతిధ్వనించేలా నవ్వాడు జాలయ్య. "అలాగేనండీ ఆఫీసరుగారూ! నన్ను జాలయ్య అంటారు. పింజల జాలయ్య అంటే ఈ చుట్టు ప్రక్కల తెలియనివాడెవడూ లేడు. ఈ ప్రాంతాల్లో కలప వ్యాపారమంతా నేనే చేస్తుంటాను" అన్నాడు జాలయ్య అదోలా నవ్వుతూ. వ్యంగ్యంగా...నువ్వు అడిగావు గాబట్టి నీకు మర్యాద ఇస్తున్నాను అనే ధోరణిలో.

నేనూ అదే ధోరణిలో సమాధానం చెప్పాను. "మంచిది జాలయ్యగారూ! మీరంతా వచ్చిన పనేమిటి? మీ వెనక వున్న ఆ ముగ్గురు మనుషులు ఎవరు?" అన్నాను.

"మావాళ్లే!" అన్నాడు గర్వంగా జాలయ్య.

"నాతో మాట్లాడవలసింది మీ రొక్కరేనా వాళ్ళు కూడానా?"

"వాళ్లెప్పుడూ నాతో కూడా వుంటారు" అన్నాడు జాలయ్య తల త్రిప్పి గర్వంగా వాళ్ళను చూస్తూ.

"ఇక్కడలా వుండడానికి వీల్లేదు. వాళ్ళకు నాతో ఏం పని లేకపోతే వాళ్ళు బయట వుండడం మంచిది."

"ఉంటేయేం? నీకొచ్చే భయమేమిటి?" విసుగ్గా అరిచాడు జాలయ్య.

"చూడండి జాలయ్యగారూ! ఇదొక ఆఫీసు...ఆఫీసులో మీకు పనుండి వచ్చినప్పుడు ఆఫీసు పద్ధతుల్నిబట్టి నడుచుకోవాలి. వాళ్ళు బయటికి వెళ్ళకపోతే నేను మీతో మాట్లాడగలిగింది ఏమీ లేదు" అన్నాను ఒకటో క్లాసు పిల్లాడికి అఆలు నేర్పుతున్న టీచర్‌లా.

నిముషంపాటు నా వేపు తీక్షణంగా చూస్తూ వుండిపోయాడు జాలయ్య. చివరికి వెనక వున్న ముగ్గురి వైపు తిరిగి "వెళ్ళి గది బయట వుండండ్రా" అన్నాడు.

వాళ్ళు ముగ్గురూ అయిష్టంగానే బయటికి వెళ్ళారు.

"ఏమిటి మీరు వచ్చిన పని?" అన్నాను వాళ్ళు గది దాటిం తరువాత. బయట ఆఫీసు స్టాఫు, గార్డులు, అందరి చెవులూ మా సంభాషణ వింటున్నాయని తెలుసు.

జాలయ్య మాట్లాడలేదు. భారంగా లాల్చీ జేబులో చెయ్యి పెట్టి పది రూపాయల నోట్లకట్ట ఒకటి బయటకు తీసి శబ్దమయ్యేలా నా ముందు బల్లమీద పడేశాడు.

"దాని గురించేగా నువ్వింత రభస చేస్తున్నావు అదిగో తీసుకో మొత్తం రెండువేలు... వెంటనే నా మనుషుల మీద పెట్టిన కేసు విత్ డ్రా చెయ్యి. కావాలంటే ఆ కొట్టు కెళ్ళిన చెట్లు అమ్మిం తరువాత మూడో వంతు వాటా కూడా ఇస్తాను" అన్నాడు జాలయ్య.

క్షణంపాటు ఆ నోట్లవంకే చూస్తూ వుండిపోయాను. "చూడండి జాలయ్యగారూ! కేసు రాత్రి రిజిష్టరయింది. ఇప్పుడు విత్ డ్రా చేసుకోవడం వీలుపడదు" అన్నాను.

జాలయ్య మొద్దు పెదిమల మీద చిన్న నవ్వు కదిలింది విజయ గర్వంతో. "కేసు రిజిష్ట్రేషన్ సంగతి నే జూసు కొంటాలేవయ్యా! ఇన్ స్పెక్టర్ గారూ...నీలాటోడేగా... మళ్ళీ నువ్వు మాత్రం మతలబు పెట్టక" అన్నాడు జాలయ్య కుర్చీలోంచి లేచే ప్రయత్నం చేస్తూ.

"కూర్చోండి జాలయ్యగారూ!" అన్నాను బల్లమీద బెల్ నొక్కుతూ.

ఇంకా ఏమిటన్నట్లు చూశాడు జాలయ్య తిరిగి కుర్చీలో సర్దుకుంటూ. ప్యూన్ వీరన్న లోపలికి వచ్చాడు.

"చూడు వీరన్నా! బయట వున్న క్లర్క్ ని, టైపిస్టుని, గార్డ్ ని ఓసారి లోపలకు రమ్మను" అన్నాను సిగరెట్ ఆర్పేసి మరోటి వెలిగిస్తూ.

"వాళ్లెందుకు?" అన్నాడు జాలయ్య అనుమానంగా చూస్తూ.

క్లర్కు, టైపిస్టు, గార్డులు అబ్దుల్లా, జానీ, శంకర్ లోపలకు వచ్చారు. వాళ్ళందరి ముఖాల్లో ఆత్రుత, ఆశ్చర్యం కనిపిస్తున్నాయి.

"చూడండి జాలయ్యగారూ! ఇందాక మీరు చెప్పిన

విషయాలు వీళ్ళందరి సమక్షంలో తమరోసారి చెప్పండి" అన్నాను ప్రశాంతంగా.

"అందరికీ చెప్పేదేమిటి? ఎవరికి తెలియని గొడవలని ఇవి? ఆ రెండు వేలూ తీసుకొని మా వాళ్ళ మీద రిపోర్టు విత్ డ్రా చేసుకోమంటున్నానంతే. ఇందులో పెద్ద విశేష మేముంది?" అన్నాడు వాళ్ళ ముఖంవైపు చూస్తూ.

"మీరందరూ ఈ గదిలో జరుగుతున్న సంభాషణకు సాక్షులు" అన్నాను నా స్టాఫ్ అయిదుగురివంక చూస్తూ. "జాలయ్యగారూ! ఓ బాధ్యతగల ప్రభుత్వ ఉద్యోగికి లంచం ఇవ్వడం నేరమని మీకు తెలియదా?" అన్నాను జాలయ్యవైపు తిరిగి.

అప్పటికిగాని జాలయ్యకు నా వ్యూహమేమిటో తట్టినట్లు లేదు. "లంచమా? నీకు లంచమెవడిస్తున్నాడు? నువ్వు డబ్బు కావాలని కబురు పంపావు, తెచ్చిస్తున్నాను... ఇందులో లంచం ఇవ్వడం సమస్యేముంది" అన్నాడు జాలయ్య తత్తరపాటు కప్పి పుచ్చుకుంటూ.

"సారీ మిస్టర్ జాలయ్యా! యూ ప్లీజ్ గెటవుట్! లంచం ఆశ చూపి నీ బందిపోటు అనుచరులపై రిపోర్టు ఉపసంహరించుకొంటాను అనుకోకు. నీ పదిమంది గుండాలకు శిక్ష పడడం ఖాయం. దాంతోపాటు ఇప్పుడు ప్రభుత్వోద్యోగికి లంచం ఇవ్వజూపావని నీ మీద వెంటనే రిపోర్టు ఇవ్వడమూ ఖాయమే. ఇక నీ డబ్బు తీసుకుని బయటికి నడు" అన్నాను ఒక్కొక్క పదమే ఒత్తి పలుకుతూ.

మా ఇద్దరి సంభాషణ వింటున్న అయిదుగురూ స్థాణువుల్లా నిలబడి వింటున్నారు. జాలయ్య ముఖం కోపంతో వుక్రోషంతో ఎర్రబడింది. బుసలు కొడుతూ, ఆయాస

పడుతూ లేచి నిలబడ్డాడు.

"ఒరేయ్! రంగనాథం! నీలాంటి ఛోటా బచ్చా ఆఫీసర్లను లక్షమందిని చూశాన్రా! నాతో తలపడి నెగ్గుకొచ్చిన వెధవ ఈ పరగణాల్లో లేడురా...నా మీదే రిపోర్టిచ్చేన్నిన్న గుండెల్రా నీకు...నా మీద రిపోర్టిచ్చిన మర్నాడు నీకు గోరీ కట్టించడం ఖాయం అని మరిచి పోకురా ఖబడ్దార్...సాయంత్రం వరకూ టైమిస్తున్నాను నీకు. ఈలోగా మావాళ్ళపై కేసు విత్ డ్రా చేసుకో న్నావా సరే లేకపోతే నీపాట్లు కుక్క కూడా పడదు" అన్నాడు బల్లమీద రెండు పిడికిళ్ళతో బాదుతూ.

"వీరన్నా!" అన్నాను నవ్వుతూ.

వీరన్న వచ్చేవరకు జాలయ్య ఆగలేదు. పెద్ద పెద్ద అంగలు వేసుకొంటూ, అలిగిన పిల్లాడికి మల్లే నేలను తన్ను కుంటూ వెళ్ళిపోయాడు బల్లమీద డబ్బు జేబులో కూరు కొంటూ.

నా ఆఫీస్ స్టాఫు ఈ సంఘటన షాకునుండి తేరుకొనే సరికి అయిదు నిముషాలు పట్టింది.

"వెల్! ఇప్పుడు జాలయ్యాలో నేను చేసిన సంభాషణ అంతా వివరంగా ఎవరికి వారు విడివిడిగా స్టేట్ మెంట్లు వ్రాసివ్వండి" అన్నా వాళ్ళ అయిదుగురివైపూ చూస్తూ.

"సార్!" అన్నాడు అబ్దుల్లా భయం భయంగా.

"గో అన్! వెళ్ళి అరగంట లోపున స్టేట్ మెంట్లు వ్రాసి తీసుకురండి" అన్నాను వాళ్ళ వంక చూస్తూ.

"సార్! మేము స్టేట్ మెంట్లు వ్రాసిచ్చామని తెలిస్తే మమ్మల్ని వాడు బ్రతకనివ్వడు సార్! పెళ్ళాం, పిల్లలు గల వాళ్ళం. ఈ గొడవల్లోకి మమ్మల్ని లాగకండి సార్!" అన్నాడు అబ్దుల్లా కళ్ళనీళ్ళ పర్యంతమవుతూ.

నిముషంపాటే వాళ్ళవైపు చూస్తూ వుండిపోయాను. నిజమే వాళ్ళ భయాలు వాళ్ళకుంటాయి. కాని నేను వీళ్ళ దగ్గర స్టేట్‌మెంట్లు తీసుకోలేదని తెలిస్తే జాలయ్య మరింత విర్రవీగుతాడు. పైగా నేనీ ఉద్యోగానికి, ప్రాంతానికి క్రొత్త. వాడి మాటలు వినలేదనే ఉక్రోషంతో జాలయ్య నా మీద లంచం తిన్నానని కేసు పెట్టొచ్చు. ఆఫీసు స్టాఫు ఎవరెలాంటివారో నాకింకా పూర్తిగా తెలియదు. వాళ్ళను భయపెట్టో, డబ్బిచ్చి లోబరచుకొనో నాకు వ్యతిరేకంగా కోర్టులో సాక్ష్యం పలికిస్తే నా పని ఖాళీ. నయానో, భయానో స్టేట్‌మెంట్లు తీసుకోవడమే మంచిదనిపించింది.

"లాభం లేదు అబ్దుల్లా! నా మాట వినండి. జాలయ్య లాటి విషప్పురుగుల్ని ఏరి పారెయ్యకపోతే మనలాంటి ప్రభుత్వోద్యోగులు పని చెయ్యలేరు. జాలయ్య మన న్నేమీ చెయ్యలేడు. న్యాయం మన పక్షాన వుంది... ప్రభుత్వం మన వెనుక అండగా వుంటుంది. ఈ కేసు ఋజువైతే జాలయ్య జైలుకి పోవడం ఖాయం. ఒక ప్రభుత్వోద్యోగికి లంచం ఇవ్వపోవడం, కొడతానని బెదిరించడం చట్టరీత్యా నేరం" అన్నాను అనునయంగా.

ఎవ్వరూ కాసేపు మాట్లాడలేదు. ఇంతలో ఏం నిశ్చయించుకున్నాడో, జానీ ముందు కొచ్చాడు.

"ఆ వెధవ జాలయ్యాకు భయపడేదేందిరా! పదండి స్టేట్‌మెంట్లు వ్రాద్దాం. ఆఫీసులో కొచ్చి మనల్ని బెదిరించడానికెన్ని గుండెలు వాడికి" అన్నాడు మిగతా వాళ్ళతో.

ఆ తర్వాత స్టేట్‌మెంట్లు వ్రాయడానికి ఎంతోసేపు పట్టలేదు.

అప్పుడే మీసాలపల్లె ఇన్‌స్పెక్టర్‌కి ఓ రిపోర్టు, యాంటీకరెప్షన్ బ్యూరో సూపరింటెండెంట్‌కి మరో రిపోర్టు, ఈ స్టేట్‌మెంట్ కాపీలు జతచేసి పంపించాను. ఇన్‌స్పెక్టర్‌కి వ్రాసిన రిపోర్టులోనే జాలయ్యా బెదిరింపుల దృష్ట్యా వెంటనే ఆఫీస్ స్టాఫ్ అంతటికీ పోలీసు రక్షణ కల్పించమని తెలియచేశాను.

8

సాయంత్రానికల్లా జాలయ్యకు జరిగిన పరాభవం గురించి తెలిసిపోయింది. నిజాయితీగా వుండే ఆఫీసర్లకు ప్రజల్లో నుండి మంచి ప్రోత్సాహం లభిస్తుందనే విషయం నిజం. మర్నాడు ప్రొద్దున్నే మాకు రక్షణగా ఇద్దరు పోలీసు కానిస్టేబుల్స్‌ని పంపిస్తున్నట్లు ఫోన్ చేశాడు మీసాలపల్లె ఇన్‌స్పెక్టర్.

"వాళ్ళ మీద రిపోర్టు ఏరకంగానూ విత్‌డ్రా చేసుకునే సమస్య లేదంటారా?" అన్నాడు ఇన్‌స్పెక్టర్ ఫోన్‌లో.

"సారీ ఇన్‌స్పెక్టర్! మీరు ఎంత త్వరగా వాళ్ళమీద కేస్ ఫైల్ చేస్తే అంత మంచిది" అన్నాను.

"ఓ. కె. ఐ అండర్‌స్టాండ్! నామీద పైనుండి చాలా ప్రెషర్ రావడం వలన అలా అన్నాను. అంతే. ఓ గజిటెడ్ ఆఫీసరు పెట్టిన కేసు కావడంచేత పైవాళ్ళు ప్రత్యక్షంగా కల్పించుకోవడానికి జంకుతున్నారు. ఈ పూటే వాళ్ళందర్నీ తాలూకా రిమాండ్‌లోకి పంపిస్తున్నాను. వాళ్ళు స్టేషన్ జైల్లో వున్నంతసేపూ నాకీ ప్రెషర్ తగ్గదు" అన్నాడు ఇన్‌స్పెక్టర్ జాలిగా.

"థాంక్యూ ఇన్‌స్పెక్టర్!" అన్నాను ఫోన్ పెట్టేస్తూ.

కాసేపట్లో మళ్ళీ ఫోను మ్రోగింది.

"హలో!" అన్నాను విసుగ్గా.

"ఫారెస్ట్ ఆఫీసరు రంగనాథేనా?"

"అవును."

"ఉండండి... యమ్మెల్లే రాయుడుగారు మాట్లాడు తారు" అన్నది అవతలి గొంతు.

"రంగనాథ్ గారేనా?" అన్నది మరో గొంతు ఓ అర నిముషం తరువాత.

"అవును" అన్నాను.

"నేను ఈ ప్రాంతం యమ్మెల్లేనండీ! నా పేరు పోతు రాయుడు!!'

"అలాగా నమస్కారమండీ!"

"చూడండీ! ఏం లేదు, నిన్న మీరు మా జాలయ్య మనుషులు అడవిలో కలప కొట్టుకెళుతోంటే అరెస్టు చేశారటగా...పాపం! వాళ్ళంతా బీద వెధవలండీ! వాళ్ళు లేకపోతే కుటుంబాలు తిండిలేక అల్లాడిపోతాయి. ఫస్ట్ అఫెన్స్ క్రింద మన్నించి ఈసారికి రిపోర్టు విత్ డ్రా చేసు కోండి" అన్నాడు పోతురాయుడు హుందాగా.

"చూడండి రాయుడుగారూ! మీరే అలా మాట్లా డితే నేను చెప్పగలిగింది ఏమీ లేదు. కాని ఒకటి మాత్రం స్పష్టం...ఇది వాళ్ళ మొదటి నేరం మాత్రం కాదు. పైగా జాలయ్యలాంటి పెద్దమనిషి వచ్చి నాకు లంచం ఇవ్వబోయాడు. వద్దంటే నాకు గోరీ కడతానని బెదిరిం చాడు. చూడండి సార్! కాస్త మీలాంటి పెద్దలు ఆ జాలయ్యగారికి బుద్ధి చెప్పాలి. ప్రభుత్వోద్యోగుల్ని బెది రించడం తప్పని ఆయనకు తెలియ జెయ్యండి" అన్నాను రాయుడు మరి మాట్లాడ్డానికి సందివ్వకుండా.

"మంచిదండీ...పాపం వాళ్ళమీద దయ చూపిం చండి" అన్నాడు రాయుడు ఫోన్ పెట్టేస్తూ.

9

సామదాన ఉపాయాలు అయిపోయాయి. ఈ రోజు నుండి మిగిలిన రెండూ అమల్లోకి తెచ్చాడు జాలయ్య.

ఉదయమే రాములయ్యగారు గదిలోకి వచ్చారు.

"కూర్చోండి!" అన్నాను కుర్చీ చూపెడుతూ.

రాములయ్య కుర్చీలో కూర్చున్నా ఎంతో ఇబ్బందిగా చెప్పదలుచుకొన్నది చెప్పలేక పోతున్నట్లు గ్రహించాను.

"చెప్పండి! ఎందుకు సందేహిస్తున్నారు?" అన్నాను. ఆయన చెప్పబోయే విషయమేమిటో నే నప్పుడే వూహించడం మొదలు పెట్టాను.

"ఏమి లేదండీ! చెప్పడానికి బాధగా వుంది గానీ, ఒంటరిగాళ్ళు ఇంట్లో వుండడంవలన ఇంట్లో ఆడవాళ్ళు కాస్త ఇబ్బంది పడుతున్నట్లున్నారు అంచేత..." అంటూ నసుగుతున్నా డాయన.

చిన్నగా నవ్వాను నేను. "దానికి మొహమాట పడతారేమండీ మీరు. మీ ఇల్లు...మీ ఇష్టం...మీ రెప్పుడు ఖాళీ చెయ్యమంటే అప్పుడు చేస్తాను. ఎలాగూ ప్రభుత్వమిచ్చిన ఆఫీసు బిల్డింగ్ వుందిగా...అదీ చాలకపోతే ఫారెస్టు బంగళాలో వుంటాలెండి" అన్నాను.

"మీరు మరేమీ అనుకోకండి" ఏదో అంటున్నా డాయన.

"చూడండి రాములయ్యగారూ! మీరింకేమీ చెప్పకండి. ఇప్పటికే నా గురించి మీరు చాలా ఇబ్బందికీ, వత్తిడికి లోనయ్యారని తెలుసు. కాని ఒక్క విషయం చెప్పండి. జాలయ్య మిమ్మల్ని బెదిరించి వుంటాడు నా చేత ఇల్లు ఖాళీ చెయ్యించమని. అవునా?" అన్నాను ఆయన కళ్ళలోకే సూటిగా చూస్తూ.

అవునన్నట్లు తలాడించారు ఆయన. నా వలన ఊళ్ళో ప్రజలెవరికీ కష్టం కలగడం ఇష్టం లేదు నాకు.

వెంటనే రెండు గంటల్లో నా మకాం మళ్ళీ ఆఫీసు లోకి మార్చేశాను. విషయం తెలిసి తన ఇంట్లో వచ్చి వుండమన్నాడు రాఘవ. ఇప్పటికే అతను తెగించి చాలా సహాయం చేశాడు. వద్దని మృదువుగా చెప్పాను.

జాలయ్య మళ్ళీ ఫోన్ చేశాడు. "ఆఖరిసారిగా చెబుతున్నాను. బంగారంలాంటి కుర్రాడివి. పిచ్చిపట్టుదలకు పోయి ప్రాణం మీదకు తెచ్చుకోక... వెంటనే రిపోర్టు విత్ డ్రా చేసుకో" అన్నాడు.

"గో టు హెల్!" అన్నాను ఫోన్ పెట్టేస్తూ.

వారం గడిచింది. పట్టుకొన్న పదిమందిమీదా డిస్ట్రిక్టు మున్సిఫ్ కోర్టులో కేసు విచారణ కొచ్చింది. ఆ రోజు కేసుకు అటెండయి తిరిగి వచ్చేప్పటికి రాత్రి పది దాటింది.

బంగళా వాచ్ మెన్ వంట తయారుచేసిపెట్టి వెళ్ళి పోయాడు నైట్ డ్యూటీకి. చల్లారిన పదార్థాలు కష్టంమీద తిని, గది గడియలు పెట్టుకొని, దిండుక్రింద పిస్తోలు పెట్టుకొని నిద్రపోయాను.

ఉదయమే జాలయ్య మీద పెట్టిన కేసు గురించి యాంటి కరెప్షన్ కు రిమైండర్ వ్రాయాలని ఆలోచిస్తూ నిద్రపోయాను.

10

"సార్! సార్!" ఎక్కడో ఎవరో పిలుస్తున్నారు. చెవులు పగిలే శబ్దాలు అవుతున్నాయి. కనురెప్పలు తెరచుకోవడం లేదు.

బలవంతంగా, అతి ప్రయత్నం మీద కళ్ళు తెరిచాను.

గదిలో వెలుతురు భరించలేక చటుక్కున కళ్ళు మూసుకొన్నాను. తలనెప్పి. భరింపలేని తలనెప్పి. మళ్ళీ చప్పుడు, ఎవరిదో పిలుపు.

"స్టాప్ దట్ సౌండ్!"_అరిచాను గొంతు చించుకొని

మరో రెండు నిముషాలగ్గాని పూర్తి స్పృహలోకి రాలేదు నేను. బాగా తెల్లవారి పోయింది. గదిలో టేబిల్ మీద గడియారం తొమ్మిది చూపెడుతోంది. గదినిండా వెలుతురు. అప్పుడు తెలుసుకొన్నాను గది బయట ఎవరో తలుపు కొడుతున్నారని.

మంచం **మీద** నుండి క్రిందకుదిగాను. కాళ్ళు నేల మీద ఆనడంలేదు, శరీరమంతా పట్టు తప్పినట్టు రబ్బరుకు మల్లే వుంది. ఒకసారి వెలుతురంతా కళ్ళలోకి రావడం వలన కళ్ళు నొప్పులు పుడుతున్నాయి. భారంగా కళ్ళు మూసుకొన్నాను. కంటి రెప్పల క్రింది నుండి నీళ్ళు కారుతున్నాయి. తలలో ఎవరో సమ్మెట్లతో బాదుతున్నట్లు నెప్పిగా వుంది. మళ్ళీ మంచం మీద కూలబడ్డాను. ఒళ్ళంతా ఏదో మత్తుగా ఉంది.

"ఎవరది?"___పిలిచాను. మనసులో ఏదో గుర్తొచ్చి ఆగి పోతోంది. రాత్రి ఏవేవో పీడకలలు మనసులో మెదలసాగాయి.

"నేను సార్ వీరన్నని. తొమ్మిదయింది సార్. పది గంటలకు మనం కోర్టుకెళ్లాలి సార్" అన్నాడు ప్యూను వీరన్న.

బలవంతం మీద మళ్ళీ లేచాను. చాలా మత్తుగా, భారంగా, వుంది. టవలుబుజాన వేసుకొని ముఖం తుడుచు కొంటూ తలుపు తీశాను.

వీరన్న నా ముఖంలోకి ఆశ్చర్యంగా చూశాడు "ఒంట్లో

బావుండలేదాసార్!'' అన్నాడు. లేదన్నట్లు తలవూపాను. ''ముఖం కడుక్కొని వచ్చేలోపల స్టౌ వెలిగించి కాసిని వేన్నీళ్ళు కాయి,'' అన్నాను.

అలమరాలోనుండి టూత్ పేస్టు బ్రష్ తీసుకొని వెనక ఆవరణలో కెళ్ళాను. బావిలో నుండి నీళ్ళు రాత్రి వాచ్ మెన్ తోడి వుండాలి తొట్లోకి. మొహం కడుక్కొని, తలస్నానం చేశాను. మత్తువదిలి నట్లనిపించింది. తలనొప్పి మాత్రం తగ్గలేదు.

కాగిననీళ్లలో కాఫీపొడి వేసి డికాషన్ తయారు చేశాను. బీరువాలో నుండి ఆస్ప్రిన్ మాత్రలు రెండు తీసి వేసుకొని డికాషన్ త్రాగాను.

తల దువ్వుకోడానికి అద్దం చూసుకొని క్షణంపాటు ఆశ్చర్యపోయాను. ఉదయమే నన్ను చూచి వీరన్న ఆశ్చర్య పోవడంలో తప్పులేదు. పీక్కు పోయిన బుగ్గలు లోతుకు పోయిన కళ్ళు మాసినగడ్డం, జబ్బు పడ్డవాడికి మల్లే వున్నాను. ఒక్క రాత్రిలో ఎందుకలా అయ్యానో అర్థం కాలేదు.

షేవ్ చేసుకొని డ్రస్ అయ్యేప్పటికి వీరన్న తిరి గొచ్చాడు. అప్పటికి జీప్ డ్రైవరు కూడా వచ్చేశాడు.

వెంటనే కోర్టుకు బయల్దేరాము. దారంతా పీడకలల గురించే ఆలోచిస్తున్నాను.

రోజంతా ఏదో మత్తుగా, భారంగా గడిచింది.... కోర్టులో కూర్చున్నా నన్నుమాటే గాని నిద్రముంచు కొస్తున్నట్లనిపించింది.

సాయింత్రనికల్లా కేసు ముగిసింది. వారంరోజుల తర్వాతకు జడ్జిమెంట్ వాయిదావేశాడు. రాత్రికి హొటల్లోనే భోంచేసి తిరిగివచ్చాను.

11

మరో పదిరోజుల్లో నా పరిస్థితి మరింత దిగజారి పోయింది. ప్రతిరాత్రి భయంకరమైన కలలు, పగలు ఎప్పుడో పదకొండు గంటలవేళ మేల్కొనడం. నిద్ర లేచినా, మత్తు, భారంగా వుండడం, చెప్పలేనంత నీరసంగా వుంటోంది. కళ్ళ వెంట, ముక్కు రంధ్రాల వెంట ఎప్పుడూ ఆగకుండా నీళ్ళొస్తున్నయ్. ఆకలి కావడం లేదు.

వాచ్ మెన్ ఏదో వండిపెడుతున్నాడు. తినబుద్ధి కావడం లేదు. అటూఇటూ కెలికి రెండు ముద్దలు నోట్లో పెట్టుకొని వదిలేస్తున్నాను. రాత్రిపూట అసలు భోంచెయ్యడం లేదు. వాచ్ మెన్ తెచ్చేపాలు త్రాగి పడుకొంటున్నాను. ఆ పాలే త్రాగకపోతే ఈ పాటికి మంచం పట్టి వుండేవాణ్ని అనిపిస్తోంది.

సాయంత్రం అయ్యేప్పటికి మనసులో చెప్పలేని దిగులు' ఏదో కావాలని తపన, ఒళ్ళంతా ఒణుకు. భయం మెల్లి మెల్లిగా జ్ఞాపక శక్తి తగ్గి పోతుందనే భయం కలుగుతోంది.

పదిరోజుల్లో శవంలా అయిపోయాను. అద్దంలో చూసుకొంటే ముఖమంతా పీక్కుపోయి, కళ్ళు లోతుకుపోయి, నీళ్ళు కారుతూ చాలా అసహ్యంగా కనిపిస్తోన్నాను. చేతులు మీదా, కాళ్ళమీద నరాలు వుబ్బి అసహ్యంగా కనిపిస్తున్నాయి, పదిరోజుల్లో ఇరవైయ్యేళ్ళ వయసుపైబడినట్లనిపిస్తోంది.

ఏది ఆలోచించలేను. ఒంటరిగా, మత్తుగా, ప్రపంచంతో సంబంధం లేకుండా ఇరవై నాలుగంటలూ అలా సుషుప్తిలోకి, తెలియని సమాధిలోకి వెళ్ళి పోవాలని

పిస్తోంది. ఏపని చెయ్యాలన్నా మనసు రావడం లేదు.

జాలయ్య మనుషులు ఒక్కొక్కరికీ ఆర్నెల్లు కఠిన కారాగార శిక్ష విధించారు. ఊరంతా జాలయ్య తన అన్న మహాలింగం చేత చేతబడి చెయ్యించాడని, నేనందుకే ఇలా అయిపోతున్నానని బహిరంగంగా చెప్పుకొంటున్నారు. ఏ విషయాన్ని పట్టించుకోవాలని అనిపించడం లేదు.

రాఘవ వచ్చి ఎవరైనా మంత్రవేత్త దగ్గరికెళదాం రమ్మన్నాడు. నవ్వి, నాన్సెన్స్ అన్నాను. అనేక విధాల బ్రతిమిలాడినా నేను ఒప్పుకోక పోవడం వలన విసుగు చెందాడు. కనీసం తన ఇంట్లోకి వచ్చి వుండమన్నాడు. రానని చెప్పాను. రాఘవ ఇంట్లో వుండే, రాఘవను కూడా వత్తిడికి గురి చెయ్యదలచుకోలేదు. ఈ ఒంటరి ప్రపంచంలో రాఘవ ఒక్కడే నాకూ మిగిలిన మిత్రుడు.

యాంటీ కరెప్షన్ బ్యూరో నుండి జవాబు వచ్చింది. జాలయ్య మీద కేసు పెట్టడానికి గ్రౌండ్సు చాలవనీ, సాక్షులంతా నా క్రింది ఉద్యోగులు కాబట్టి, కేసులో అట్టే బలం లేదనీ వ్రాశారు. అయినా ప్రాథమిక దర్యాప్తు కోసం వాళ్ళ మనిషి ఒకడు త్వరలో నా దగ్గరకు వస్తాడనీ వ్రాశారు. డామిట్!

మర్నాటి వుదయానికి నా పరిస్థితి మరింత దిగజారింది. మత్తు, నీరసం ... డిప్రెషన్, తలనొప్పితో పాటు విపరీతమైన కడుపునొప్పి, ఛాతిలో విపరీతమైన మంట మొదలయ్యాయి. ఉపేక్షించి లాభం లేదనిపించింది. డ్రైవర్ని తీసుకొని వెంటనే మీసాలపల్లె గవర్నమెంట్ హాస్పిటల్ కి వెళ్ళాను.

"ఇటీజ్ రేదర్ ఫూలిష్! మీలో మార్పు గమనించిన రోజే మీరు మెడికల్ చెకప్ చేయించుకోవలసింది."

అన్నాడు డాక్టర్ – ఈపదిరోజుల్లో నాలో వచ్చిన మార్పు విని.

చాలా కుర్రాడు అతను. నాలాగే, అప్పాయింట్ అయి రెండు నెలలయిందట. య. మ్మెస్. వెంటనే రకరకాల పరీక్షలు చేశాడు. క్రొత్త మూలాన అనవసర మైనవన్ని చేస్తున్నాడనిపించింది.

బ్లడ్ ప్రెషర్ చూశాడు. టెంపరేచర్ తీశాడు. రెండూ అబ్నార్మల్ గానే వున్నాయి. బ్లడ్ ప్రషర్ నూట డెభైయ్, టెంపరేచరు తొంభై తొమ్మిది పాయింట్ నాలుగు వుంది.

"కనీసం మీరు టెంపరేచరన్నా చూసు కోవలసింది" అన్నాడు చిక్కిపోయిన నాశరీరాన్ని జాలిగా చూస్తూ.

బల్లమీద పడుకోబెట్టి పొట్టంతా నొక్కిచూశాడు. పల్స్, హార్ట్ బీటింగ్ చూశాడు. స్టూలు మీద కూర్చోబెట్టి చిన్న రబ్బరు సుత్తితో మోకాలు మీద కొట్టాడు. ఏమీ అవలేదు. కాలు కొద్దిగా కదిలింది. అంతే!

"అలాచేస్తే ఏమవుతుంది డాక్టర్?" అడిగాను.

"అవయవాల మోటార్ రియాక్షన్ టెస్ట్ చెయ్యడం. నిజం చెప్పాలంటె మీ మోటార్ రియాక్షన్స్ చాలా స్లోగా వున్నాయి." అన్నాడు గబగబ చీటిమీద ఏదో వ్రాసి నర్సుకిస్తూ.

"వెల్ డాక్టర్? ఏమిటంటారు నా జబ్బు?" అన్నాను పరిహాసంగా.

"నేనింకా ఏమీ నిర్ణయం చేయలేదు. కాని నా స్ట్రాంగ్ బిలీఫ్, లేదా ఊహ అనండి, ఏమిటంటే, మీ బాడీలో కొన్ని అసాధారణమైన ఆల్కెమిక్ (రసాయన

సంబంధమైన) మార్పులు రావడం వలన సైకోఫిజికల్ డిప్రెషన్ ఏర్పడింది అనుకొంటున్నాను.'' అన్నాడు డాక్టర్.

"వాట్? విపులంగా చెప్పండి డాక్టర్'' అన్నాను ఆశ్చర్యంగా.

"ప్రస్తుతాని కేమీ చెప్పలేను, మీ బ్లడ్, యూరిన్ టెస్ట్ చేస్తే వెంటనే రిజల్ట్ తెలుస్తుంది'' అన్నాడు నర్స్ ఇచ్చిన సిరంజ్ తీసుకొని దగ్గరికి వస్తూ. బ్లడ్ తీసుకోవడం అయింతరువాత ప్రిస్క్రిప్షన్ పాడ్ మీద ఏవో మందులు వ్రాశాడు.

"ఈ అల్కాలైన్ సిట్రేట్ వెంటనే పూటకు, మూడు చెంచాలు తీసుకోండి. 'టిరిడిసాల్' ఇంజక్షన్ వ్రాస్తున్నాను. రోజుకు 200 య మ్మెల్ చొప్పున తీసుకోండి. ఈ 'సైకోజ్' టాబ్లెట్లు పూటకుఒకటి చొప్పున వేసుకోండి. రాత్రిపడుకొనేటప్పుడు మాత్రం రెండు వేసుకొని పడుకోండి'' అన్నాడు ప్రిస్క్రిప్షన్ చేతికిస్తూ.

ఒకటి టానిక్, మరొకటి ఇంజక్షన్, ఇంకోటి టాబ్లెట్స్...ఇవ్వవలసిన మందులన్ని ఇచ్చాడు.

"మరో విషయం మిష్టర్ రంగా! మీకింకా కడుపు నొప్పి వస్తోందా!'' అడిగాడు.

"నో! డాక్టర్! మీదగ్గరికి వద్దామని బయలేరిన కాసేపటికి పోయింది'' అన్నాను.

"రైటో! మీరు మాత్రం గుడ్ డయిట్ తీసుకోవాలి. యూజ్ లాటాఫ్ ఫ్రూట్! ఎనీఫ్రూట్!'' అన్నాడు డాక్టర్.

మర్నాడు ఉదయమే యూరిన్ టెస్ట్ కు పంపించాను. మధ్యాహ్నం రెండు గంటలవేళ డాక్టర్ ఫోన్ చేశాడు.

"హలో డాక్టర్! ఏమిటి మా రిజల్టు!" అన్నాను ఆత్రతగా.

చెప్పాడు డాక్టర్ చాలా విపులంగా, నిదానంగా.

ఫోన్ లో వింటున్న నాకు రిసీవర్ మీద పిడికిలి బిగుసుకొంది. "ఆర్ యు ష్యూర్ డాక్టర్?" అన్నాను గుసగుసలాడుతున్నట్టు.

"అయామ్ డామ్ ష్యూర్! లేకపోతే మిమ్మల్నిలా ఫోన్ లో పిలిచి చెప్పేవాణ్నే కాదు. మీరు ఇమ్మీడియట్ గా హాస్పిటల్లో అడ్మిట్ అవ్వాలి."

నాలో కోపం సుళ్ళు తిరుగుతోంది. మెల్లిగా శరీరంలో వణుకు ప్రారంభమయింది. జాలయ్య మీద కోపం, కసి క్షణక్షణానికీ పెరిగిపోతోంది.

"సారీ డాక్టర్! నేను వెంటనే హాస్పిటల్ లో అడ్మిట్ అవలేను" అన్నాను.

"మిస్టర్ రంగా! మొండితనంగా ప్రవర్తించకండి. ఆలస్యం చేస్తే మీ ప్రాణాలు పోయే అవకాశం వుంది." అన్నాడు డాక్టర్.

"అయామ్ ఎక్స్ట్రీమ్లీ సారీ డాక్టర్! నేనిక్కడ చెయ్యాల్సిన పనులు చాలా వున్నాయి. నాకు రేపు వుదయం వరకూ టైమివ్వండి"_ అన్నాను మొండిగా.

"డోన్ట్ సే ఐహావ్న్ట్ వార్న్డ్ యు! రేపటికి పరిస్థితి చేజారిపోవచ్చు" అన్నాడు డాక్టర్ కోపంగా.

"ఐయామ్ సారీటు డిస్ ఒబేయు డాక్టర్! తప్పదు! థాంక్యూ!"_ అన్నాను ఫోన్ పెట్టేస్తూ.

12

జీపును తిన్నగా మహాలింగం శివాలయానికి తీసుకెళ్ళమని చెప్పాను. డ్రైవర్ని వెళ్ళిపొమ్మని చెప్పి నేనొక్కణ్నే లోపలకి వెళ్ళాను. గుడివెనక పెంకుటిల్లు వరండాలో

మహాలింగం గోడ కానుకోని చదికిలబడి వున్నాడు.

నన్ను చూడగానే క్రూరంగా నవ్వాడు. "ఓహో ఫారెస్ట్ ఆఫీసరుగారా! ఏమిటి దారితప్పి వచ్చారు?" అన్నాడు వ్యంగ్యంగా.

నేనున్న స్థితిలో కళ్ళనీళ్లు రావడం ఏమంత కష్టం కాలేదు, ముందుకువెళ్ళి మహాలింగం కాళ్ళమీద పడ్డాను.

"క్షమించండి స్వామీ, గర్వంలో, అహంకారంతో మీతో వైరం పెట్టుకొన్నాను. నాకీబాధ నుండి విముక్తి కలిగించండి, ఈ నరకం నుండి నన్ను తప్పించండి" అన్నాను బిగ్గరగా ఏడుస్తూ.

"ఏమిటి? ఏమిటి నువ్వంటున్నది" అన్నాడు మహాలింగం ఆశ్చర్యంగా. ఇంకా బిగ్గరగా వెక్కిళ్ళతో ఏడ్చాను. "ఈపాపిని మన్నించి మీ మంత్రం ఉపసంహరించుకోండి స్వామీ! మీరేది చెపితే అది చేస్తాను. నన్ను మాత్రం వదలిపెట్టండి" అన్నా అతని కాళ్ళను వదలకుండా.

"మూరుడా! ముందు కాళ్ళు వదులు, ఈ జ్ఞానం ముందుంటే ఇంత బాధపడేవాడివి కాదు." అన్నాడు మహాలింగం చాపమీద నుండి లేచి దూరంగా జరుగుతూ.

మళ్ళీ ముందుకు జరిగి, ఈసారి అతని రెండు కాళ్ళు ఇంకా గట్టిగా పట్టుకొన్నాను.

"మీరు నన్ను రక్షిస్తానని అభయహస్తం ఇస్తే తప్ప మీ కాళ్లు వదిలేది లేదు." అన్నాను తలెత్తి అతని ముఖంలోకి చూస్తూ.

మహాలింగం ముఖంమీద నవ్వులాంటిదేదో కనిపించింది. "సరేలే! నీవలన పది కుటుంబాలు కష్టాలలో పడ్డాయి, వాళ్ళకు నష్టపరిహారం ఇచ్చుకొంటే నిన్నీబాధ నుండి విముక్తుణ్ని చేస్తా" అన్నాడు మహాలింగం విశ్వామిత్రుళ్ళా.

"అలాగే స్వామీ మీ ఇష్టం. మీరేం చెబితే అదిచేస్తా. నన్నుమాత్రం ఈ బాధ నుండి తొలగించండి" అన్నాను అతని పాదాలు కళ్ల కద్దుకొంటూ.

"అవన్నీ జాలయ్య చూసుకొంటాడు, ఇప్పుడే కబురు పెడతానుండు" అన్నాడు, మహాలింగం దేవాలయంవైపు వెళుతూ.

నేను నీరసంగా లేచి కూర్చొని అతను వెళ్ళిన వైపే చూస్తూ వున్నాను. మహాలింగం అతిప్రయాసగా గుడి మెట్లెక్కి అడవివైపు తిరిగి 'ఓహో!' అంటూ రెండు పొలికేకలు పెట్టాడు. అతనిస్వరం విని అదిరిపడ్డాను నేను. లౌడ్ స్పీకర్ లో అరిచినట్లుంది.

కాసేపట్లో బంగళా వాచ్ మెన్ పరిగెత్తుకొంటూ వచ్చాడు అడవిలో నుండి. అతన్తో ఏదో చెప్పి పంపించేశాడు మహాలింగం.

నాకు క్షణక్షణానికీ నీరసంవచ్చేస్తోంది. గోడకానుకొని అలానే కూర్చుండి పోయాను. "వాచ్ మెన్ కూడా మీ భక్తుడేనా స్వామీ?"- అన్నాను నీరసంగా.

"తప్పు తప్పు శివసేవకులు" అన్నాడు మహాలింగం.

వరెండా గోడ నానుకొని అలాగే నిద్రపోయాను. ఎవరో భుజంపట్టుకు కదుపుతోంటే మెలకువ వచ్చింది. భారంగా కళ్ళు తెరిచాను. ఎదురుగా నలుగురైదుగురు వ్యక్తులు నిలబడి వుండడం లీలగా కనిపిస్తోంది.

"దాహం" అన్నాను. కాసేపటికి ముఖం మీద నీళ్లు చల్లి, నోట్లో నీళ్ళు పోశారు.

ఎదురుగా జాలయ్య నిలబడివున్నాడు. వాడి ప్రక్కనే రామభక్తుల్లా ముగ్గురు వస్తాదులు, వాచ్ మెన్, మహాలింగం నిలబడి వున్నారు.

"ఏమోయ్ రంగనాథం, మేడ దిగావంటగా?" అన్నాడు జాలయ్య నవ్వుతూ. మిగిలిన అందరూ పగలబడి నవ్వారు.

బలహీనంగా నవ్వాను, రెండు చేతులూ ఎత్తి నమస్కారం చేస్తూ.

"అదృష్టవంతుడివి. ఈరోజుకైనా తెలివి తెచ్చుకొన్నావు, ఆ పది మంది కుటుంబాలకీ నష్ట పరిహారం ఇచ్చుకొంటావా?" అడిగాడు.

"నావద్ద ఇవ్వడానికి ఏమీ లేదు" అన్నాను నీరసంగా.

"ఓ పది గంధపుచెట్లు కొట్టుకొంటే పోలా" అన్నాడు వాచ్ మెన్. "మీ ఇష్టం" అన్నాను.

"సరే! దీనిమీద ఓ సంతకం పారేయ్. తర్వాత వ్యవహారం ఎటుపోయి ఎటొచ్చినా పని కొస్తుంది" అన్నాడు ఓ కాగితం పెన్ను నాకిస్తూ.

కాగితం వంక తేరిపార జూశాను. తెండరు గ్రాంట్ ఫారం అది. పది గంధపుచెట్లు కొట్టుకోమని ప్రభుత్వం తరుఫున నేను గ్రాంట్ చేసే ఫారం. ఆఫీసు ముద్రతో సహా అన్ని పూర్తి చేసి వున్నాయి, నా సంతకం తప్ప. అంటే తర్వాత నేను ఎదురు తిరిగితే నేను ప్రభుత్వానికి తెలియకుండా టెండరు గ్రాంట్ చేసి, టెండరు డబ్బు తిన్నట్లు ఋజువు చెయ్యడాని కది పనికొస్తుంది.

సంతకం పెట్టబోయి ఆగిపోయాను. మెల్లిగా లేచి నిలబడ్డాను. "ఏమిటి?" అడిగాడు జాలయ్య.

కాండ్రించి అతని ముఖం మీద తుపుక్కున ఉమ్మాను. జాలయ్య ముఖంలో క్షణం ఆశ్చర్యం కనిపించింది. మరు క్షణం తేరుకొన్నాడు.

అర చెయ్యి తిప్పి ముఖంమీద బలంగా కొట్టాడు. కళ్ళు తిరిగినట్లనిపించింది. తూలి క్రింద పడ్డాను. బొడ్లో

పిస్తోలు పొట్టలో గుచ్చుకొంది. బాధగా మూల్గాను. జాలయ్య అనుచరుడొకడు నడుం మీద తన్నాడు. వెన్ను విరిగిందనిపించింది.

పైకి లేవడానికి ప్రయత్నిస్తూనే పిస్తోలు బయిటికి తీశాను. నామీద వస్తున్నవాడి కాళ్ళను చూసి కాల్చాను.

"అమ్మో" అని అరిచాడు వాడు ఎగిరి క్రిందపడుతూ.

మిగిలిన నలుగురు ఎక్కడి వాళ్ళక్కడే ఆగిపోయారు. జాలయ్య కోపంతో పళ్ళు పటపట కొరికాడు. పిస్తోలు మ్రోత వినగానే ఆ చుట్టు ప్రక్కల దాగిన పోలీసులు ఒక్కుమ్మడిగా మీదపడి జాలయ్య ముఠాని బంధించారు. నేను నీరసంతో కూలబడి పోయాను.

13

నేను కళ్ళు తెరిచేసరికి హాస్పిటల్లో వున్నాను.

కాళ్ళ దగ్గర నాన్న, అమ్మ, తమ్ముళ్ళు, చెల్లాయి కనుపించారు. అందరూ ఆతృతగా నా ముఖంలోకే చూస్తున్నారు. బలహీనంగా నవ్వాను. ఒళ్ళంతా నెప్పులు. కడుపులో సూదులు గుచ్చినట్లు వుంది.

"కదలకండి" అన్నారు ఎవరో. తల త్రిప్పాను. నెప్పిగా వుంది. డాక్టర్ నవ్వుతూ చూశాడు.

"కంగ్రాచ్యులేషన్ మిస్టర్ రంగా, ఆపరేషన్ నుండి చాలా త్వరగా తేరుకొన్నారు" అన్నాడు డాక్టర్.

"ఆపరేషన్ చేశారా డాక్టర్?" అన్నాను, గొంతు ఎక్కడో నూతిలో నుండి వచ్చినట్లుంది.

"యస్, క్వయిట్ సక్సెస్ ఫుల్! మీ కడుపులోంచి ఏంతీశానో చూస్తారా," అన్నాడు నర్సుకు సైగచేస్తూ.

ఏదో బాటిల్ లాంటిది పట్టుకొచ్చింది. బాటిల్ లోనిది నాకు కనబడేలా పట్టుకొన్నాడు డాక్టర్. నల్లగా, పీచులా, వుండలా వుంది.

"నల్లమందు, ఇంకా కొన్ని తెలియని వేర్లూ కలిపి తయారుచేసింది. రోజూ మీకు వంటచేసే వాచ్ మెన్ సహాయంతో మీకు తినిపించాడు మహాలింగం. ఇదిలోపల కడుపులో జీర్ణకోశంలో స్థానంచేసుకొని నాచులా పెరగడం ప్రారంభించి మీరక్తాన్ని కలుషితం చేసింది. దీని పేరేమిటో నాకు సరిగా తెలియదు. పూర్తి ఫోరెన్సిక్ రిపోర్ట్ కోసం పోలీస్ లాబ్ కు పంపిస్తున్నాము. చాలావిష పదార్థం అయ్యుండాలి. పదిరోజుల్లో మీరక్తాని పూర్తిగా కలుషితం చేసింది. మొన్న ఆపరేట్ చేసి బ్లడ్ ట్రాన్ ఫ్యూజన్ చేసివుండకపోతే," ఆగిపోయాడు డాక్టర్.

అమ్మ, చెల్లాయి వెక్కి వెక్కి ఏడుస్తున్నారు, తల తిరుగుతున్నట్లుంది.

"జాలయ్య?" అన్నాను బలహీనంగా.

"జాలయ్యను, వాడిముఠాని జైల్లో వేశారు. వాచ్ మెన్ ను పోలీసులు బెదిరించేప్పటికి జాలయ్య దగ్గర డబ్బు తీసుకొని మీకు రోజూ పాలల్లో ఈ మందు కలిపి నట్లు ఒప్పుకొన్నాడు. వాళ్ళు పట్టుపడే ముందు రోజు రాత్రి ఇచ్చిన పాలు మీ గదిలో చెంబులో అలానే వున్నాయి. దాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. ఈ కడుపులో పదార్థం పాలల్లో పదార్థం ఒకటేనని ఋజువైంది. క్రిమినల్ కాన్స్పిరేషన్ క్రింద పదిహేనేళ్ళకు తగ్గకుండా జైలు పడుతుంది. గర్భగుడిలో దొరికిన కొన్ని గంధం చెక్కల మీది నంబర్లు పోయిన దుంగలవే అని ఋజువైనాయి. జాలయ్య, వాడిముఠా ఇక జైల్లోంచి బయిటికొచ్చే అవకాశంలేదు" అన్నాడు డాక్టర్.

నీరసంగా కళ్ళు మూసుకొన్నాను.

—: ఐపోయింది :—